PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 93 | విజయవాడ, సోమవారం 3 నవంబర్ 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 3 November 2025 | Rs


నింగిలోకి దూసుకెళ్తున్న ఎల్‌వీఎం 3-మిషన్

గగనవీధుల్లో దూసుకెళ్లిన 'బాహుబలి'

- ఎల్‌వీఎం-3 ప్రయోగం విజయవంతం
- ఇది ఒక మైలురాయి : ఇస్రో చైర్మన్

ప్రజాశక్తి- సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా)

ఇస్రో చేపట్టిన ఎల్‌వీఎం3-మిషన్ 5 'బాహుబలి' రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. కౌంట్‌డౌన్ అనంతరం కమ్యూనికేషన్ శాటిలైట్ సిఎంఎస్-3 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని 16.09 నిమిషాల్లో నింగిలోకి మోసుకెళ్లి భూస్థిర కక్ష్యలోకి విజయవంతంగా చేర్చింది. ఇది ఎల్‌వీఎం 3 సిరీస్‌లో ఐదో విజయవంతమైన ప్రయోగం. శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు ఎల్‌వీఎం 3- ఎం5 రాకెట్ నిప్పులు చెరుగుతూ నింగిలోకి దూసుకెళ్లింది. 4,410 కిలోల బరువు ఉన్న ఉపగ్రహాన్ని భూస్థిర కక్ష్యలో నిలపడం ద్వారా దేశంలో కమ్యూనికేషన్, నావిగేషన్, రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే విధంగా రూపకల్పన చేశారు. 'భారత అంతరిక్ష ప్రయోగంలో ఇది ఒక మైలురాయి' అని ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించిన ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వ్యాఖ్యానించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రయోగం వల్ల దేశీయ సాంకేతికతతోపాటు కమ్యూనికేషన్ సేవలు మరింత మెరుగుపడతాయని, జాతీయ భద్రతలో కీలకంగా అంతరిక్షం నుంచి నిఘా మరింత పటిష్టం చేయడంలో ఈ శాటిలైట్ కీలకంగా మారనుందని చెప్పారు. ముఖ్యంగా చైనా, పాకిస్తాన్ నౌకల కదలికలపై నిఘా ఉంటుందని, దేశరక్షణ వ్యవస్థలో కీలకమైన జలాంతర్గాములు, నౌకలకు సాంకేతిక సహకారం అందిస్తుందని తెలిపారు. ఆ దిశగా ఎల్‌వీఎం 3 రాకెట్ పదేళ్లపాటు సేవలు అందించే దిశగా రూపకల్పన చేసినట్లు వివరించారు. జిశాట్-7 స్థానంలో ఎల్‌వీఎం-3 రాకెట్ విజయవంతంగా ప్రయోగించామని, ఇది అద్భుత విజయమని పేర్కొన్నారు.



ప్రపంచ కప్‌తో భారత్ అమ్మాయిల విజయ దరహాసం

విశ్వవిజేత భారత్

చిరకాల స్వప్నం సాకారం
మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్లో సౌత్రాఫ్రికాపై హర్మన్‌ప్రీత్ సేన అద్భుత విజయం
షెఫాలి వర్మ, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షో


షెఫాలీ వర్మ (87) ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్ మ్యాచ్

ముంబయి : భారత మహిళా క్రికెట్ కొత్త చరితను లిఖించింది. స్వదేశంలో జరిగిన ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ అమ్మాయిలు అదరగొట్టారు. తుదిపోరులో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో ఘన విజయం సాధించారు. తొలిసారి వన్డే ప్రపంచకప్‌ను కైవశం చేసుకున్నారు. ఇప్పటికి రెండుసార్లు ఈ కప్ ఫైనల్‌లో విఫలమైనా, మూడోసారి టైటిల్‌ను పట్టేశారు. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాపై రికార్డు విజయం సాధించి ఫైనల్‌కు దూసుకొచ్చిన భారత్ ఫైనల్లోనూ అదే జోరు ప్రదర్శించింది. బ్యాట్‌తో, బంతితో రాణించి విశ్వవిజేతలుగా ఆవిర్భవించారు. ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. అనంతరం దక్షిణాఫ్రికాను 45.3 ఓవర్లలో 246 పరుగులకే ఆలౌట్ చేశారు. భారీ లక్ష్య ఛేదనను సఫారీలు నిదానంగా ప్రారంభించారు. దీంతో తొమ్మిది ఓవర్లకు 51 పరుగులు చేశారు. తరువాత ఓవర్‌లోనే ఓపెనర్ తజ్మిన్ బ్రిట్స్ (23) రనౌటైంది. మరో ఓపెనర్ లౌరా వోల్వార్డ్ (101) ఒంటరి పోరాటం చేసింది. వరసగా వికెట్లు పడుతున్నా మరోవైపు ధాటిగా ఆడింది. సెంచరీ తరువాత ఆమె నిష్క్రమించింది. తరువాత అనెరి డెర్క్‌సెన్ (35) కొద్దిసేపు పోరాటం చేసింది. ఆమె తరువాత దక్షిణాఫ్రికా పోరాటం ముగిసింది. మ్యాచ్ భారత్ సొంతమైంది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 5 వికెట్లు సాధించగా, షెఫాలీ వర్మ రెండు, శ్రీచరణి ఒక్క వికెట్ సాధించారు. ఇద్దరు రనౌట్ అయ్యారు. షెఫాలీ వర్మకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, దీప్తి శర్మ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ సొంతం చేసుకున్నారు.

విశ్వ విజేతగా నిలిచిన భారత్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఇతర ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని వివరాలు 6లో..

కంపెనీల ఇష్టారీతి దోపిడి



- మూడేళ్లల్లో వసూలు చేసిన ప్రీమియం రూ.5,850 కోట్లు
- రైతులకు చెల్లించిన పరిహారం రూ.930 కోట్లు
- వాతావరణ బీమాకు రూ.1,567 కోట్లు తీసుకొని ఇచ్చింది సున్నా
- అన్నదాతకు అక్కరకు రాని పంటల బీమా

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కేంద్ర ప్రభుత్వ పంటల బీమా పథకాలు.. తరచు విపత్తులతో నష్టాలను చవిచూస్తున్న రైతులకు అక్కరకు వచ్చే బదులు ఇన్సూరెన్స్ కంపెనీల ఇష్టారీతి దోపిడీకి బాగా పనికొస్తున్నాయని గడచిన మూడేళ్ల అనుభవాలు కుండబద్దలు కొడుతున్నాయి. ఈ విచ్చలవిడి దోపిడీలో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలదే హవా. కేంద్ర స్కీంలు ఫసల్ బీమా, పునర్వ్యవస్థీకరించిన వాతావరణ బీమా పథకాల్లోకి 2022 ఖరీఫ్ నుంచి నాటి వైసిపి ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చేరింది మొదలుకొని టిడిపి కూటమి సర్కార్ తొలి ఏడాది 2024 రబీ వరకు రైతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా కంపెనీలకు దాదాపు రూ.5,860 కోట్లు చెల్లించగా, విపత్తుల బారినపడ్డ రైతులకు ఇప్పటికి చెల్లించిన పరిహారం రూ.930 కోట్లు మాత్రమే. కంపెనీలు రూ.4,930 కోట్లు లాభాలు మూటగట్టుకున్నాయి. వసూలు చేసిన మిగతా 5లో

ఫసల్ బీమా

సీజన్	గ్రాస్ ప్రీమియం రూ.కోట్లు	చెల్లించిన పరిహారం
2022 ఖరీఫ్	1,882.82	567.48
2022-23 రబీ	1,090.75	41.88
2023 ఖరీఫ్	558.19	24.18
2023-24 రబీ	406.50	94.27
2024 ఖరీఫ్	355.95	8.53
2024-25 రబీ	193.71	000

వాతావరణ బీమా

సీజన్	గాస్ ప్రీమియం రూ.కోట్లు	చెల్లించిన పరిహారం
2023 ఖరీఫ్	628.96	000
2023-24 రబీ	178.12	000
2024 ఖరీఫ్	739.29	000
2024-25 రబీ	20.25	000

ఉచిత పంటల బీమా పున:ప్రారంభించాలి

- కౌలు రైతులను ఆదుకోవాలి
- పరిహారంతో పాటు ధాన్యం కొనుగోలు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రైతులకు ఉచిత పంటల బీమా పథకాన్ని పున:ప్రారంభించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన సమయంలో పంటల బీమా పథకం రైతులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని కోరారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మొంథా తుపాను బాగా దెబ్బతీసిందని, ఈ తుపానుతో నష్టపోయిన వాస్తవ బాధితులందరినీ నమోదు చేయడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. తుపానును నియంత్రించడం వల్ల తక్కువ నష్టం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం చూపించేందుకు తగ్గించి చూపుతుందని పేర్కొన్నారు. తుపాను వల్ల నష్టపోయిన రైతులకు పూర్తి పంట నష్టపరిహారం చెల్లించడంతో పాటు వారి నుంచి ధాన్యం కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 2019-20లో నాటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.1తో ఉచిత పంటల బీమా పథకం తీసుకొచ్చిందన్నారు. ప్రీమియం మొత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాయన్నారు. 2022లో వచ్చిన వరదల సమయంలో ఈ పథకం వల్ల రాష్ట్రం మొత్తం రూ.3 వేల కోట్లు వస్తే ఒక్క అనంతపురం జిల్లాకే రూ.1000 కోట్లు వచ్చిందని వివరించారు. కాని దీనివల్ల కౌలు రైతులకు ఏ మేలు జరగలేదన్నారు. కౌలు రైతులకు కూడా వర్తించేలా సమగ్ర పంటల బీమా పథకం ప్రవేశపెడతామని ఎన్నికల సమయంలో టిడిపి వాగ్దానం చేసిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితో 2024 రబీ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసి, రైతులే ప్రీమియం చెల్లించే స్వచ్ఛంద బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఉచిత పంటల బీమా పథకం వల్ల 2024 ఖరీఫ్‌లో 35 లక్షల మంది రైతులకు 84 లక్షల ఎకరాలకు ఇన్సూరెన్స్ వర్తిస్తే, కొత్త పథకం వల్ల రైతుల సంఖ్య 7 లక్షలకు, భూమి 19 లక్షల ఎకరాలకు పడిపోయిందన్నారు. అన్ని పంటలకు వర్తించేలా ఉన్న ఫసల్, వాతావరణ బీమా పథకాలు కేవలం బ్యాంకు రుణాలు తీసుకున్న రైతులకే వర్తిస్తున్నాయన్నారు. ఉచిత పంటల కింద గతంలో ఎన్ని ఎకరాలున్నా రూ.1 చెల్లించే రైతులు ఇప్పుడు ఎకరాకు రూ.600 నుంచి రూ.2వేల వరకు చెల్లిస్తున్నారని వివరించారు. ఇన్సూరెన్స్ పథకాన్ని ప్రభుత్వాలు నిర్వహించకూడదని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఒత్తిడి వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉన్న పంటల బీమా కార్పొరేషన్‌ను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు ఉండే అధికారం రైతుల ప్రయోజనాల కోసం ఇన్సూరెన్స్ కంపెనీ ఏర్పాటు చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం దీనిని ప్రశ్నించలేదని, ప్రస్తుత ప్రభుత్వం అసలు పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వమే పంటల బీమా కంపెనీ పెట్టి ఉచిత బీమా పథకం అమలు చేస్తే ఎలాంటి నష్టం ఉండదని తెలిపారు. 2024 ఖరీఫ్‌లో రైతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.1,100 కోట్ల ప్రీమియం చెల్లిస్తే రైతులకు కేవలం రూ.9 కోట్లే వచ్చిందన్నారు. పంటల బీమా పథకం 75 శాతం ప్రైవేట్ కంపెనీలదే అని, ఆ కంపెనీలు రైతులకు పరిహారం ఇవ్వడం లేదన్నారు. గతేడాది రూ.1,875 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉండగా ప్రైవేట్ కంపెనీలు ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా సవాలక్ష కొర్రీలు పెడుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ, రైతుల డబ్బులను ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పంటల బీమా ఏ స్థితిలో ఉందో అధికారులకు కూడా తెలియక గందరగోళంలో ఉన్నారన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఇన్సూరెన్స్ కంపెనీని తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని, ప్రైవేట్ కంపెనీల జోక్యం లేకుండా ప్రభుత్వాలే రైతులకు సకాలంలో ఇన్సూరెన్సు పరిహారం అందించాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఇ-క్రాప్‌లో మిగతా 5లో

లండన్‌లో సిఎం దంపతులు

నేడు పలు సంస్థల ప్రతినిధులతో భేటీ


లండన్‌లో సిఎం దంపతులకు స్వాగతం పలుకుతున్న తెలుగువారు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిఎం చంద్రబాబు దంపతులు ఆదివారం రాత్రి లండన్‌కు చేరుకున్నారు. విమానాశ్రయంలో తెలుగు కుటుంబాలు వారికి స్వాగతం పలికాయి. ఈ నెల 4న ఎన్‌టిఆర్ మేనేజింగ్ ట్రస్టీ, హెరిటేజ్ ఫుడ్స్ ఎమ్‌డి నారా భువనేశ్వరికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ సంస్థ రెండు అవార్డులు అందించనుంది. డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025 అవార్డు అందించనుంది. అలాగే హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎక్స్‌లెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డును భువనేశ్వరి అదే వేదికపై అందుకోనున్నారు. ప్రజాసేవ, సామాజిక ప్రభావం అంశాల్లో కీలకంగా పని చేసినందుకు డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డునూ అందుకోనున్నారు.

విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సుకు అక్కడి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించేందుకు సోమవారం పలువురు పారిశ్రామికవేత్తలతో సిఎం భేటీ కానున్నారు. ఆక్టోపస్ ఎనర్జీ గ్రూప్ డైరెక్టర్ క్రిస్ ఫ్రిట్జ్ గెరాల్డ్, హిందూజాకు చెందిన వివిధ సంస్థల చైర్మన్లు అశోక్ హిందూజా, షోమ్ హిందూజాలతో సిఎం భేటీ కానున్నారు. ఇక రోల్స్ రాయిస్ గ్రూప్ చీఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫీసరు నిక్కీ-గ్రాడీ స్మిత్, శ్రామ్ అండ్ మ్రామ్ సంస్థ చైర్మన్ శైలేష్ హీరానందాని, శ్యామ్ కో-హోల్డింగ్స్ చైర్మన్ సంపత్‌కుమార్‌తో వరుస సమావేశాల్లో పాల్గొనున్నారు. లండన్‌లోని ఇండియన్ హైకమిషనరు దొరైస్వామితో సిఎం భేటీ కానున్నారు.



మైపాడు బీచ్‌లో ముగ్గురు ఇంటర్ విద్యార్థులు మృతి

ఎవరిని బలిపశువు చేస్తారు?

- పోలీసుల అదుపులో ఇద్దరు తాపీ మేస్త్రీలు

3

గ్రామాల్లో పంట నష్టం జాబితాల ప్రదర్శన

- వ్యవసాయశాఖ డైరెక్టరు మనజీర్ జిలానీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మొంథా తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతుల జాబితాను గ్రామ స్థాయిలో ప్రదర్శించి సామాజిక తనిఖీ చేయాలని అధికారులకు వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ ఆదేశించారు. పంట నష్టం నమోదు ప్రక్రియ చివరి దశకు చేరుకుందని, ఇప్పటి వరకూ ప్రాథమిక అంచనా విస్తీర్ణం 1,24,416 హెక్టార్లలో 90 శాతం ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19 జిల్లాల్లో నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవడంతో సామాజిక తనిఖీ చేపట్టబోతున్నాయని తెలిపారు. తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో నష్టం అంచనా కొంత మేర పెరిగినట్లు తెలిపారు. ఈ జిల్లాలో నమోదు ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. పంట నష్టం నమోదు పూర్తయిన వెంటనే సామాజిక తనిఖీ చేపట్టి, రైతుల విజ్ఞప్తులను స్వీకరించేలా క్షేత్రస్థాయి అధికారులకు మార్గదర్శకాలు విడుదల చేయాలన్నారు. నమోదు ప్రక్రియ పూర్తి స్థాయి పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. రైతుల నుంచి అందిన ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరించి పరిశీలించి, పరిష్కరించి గ్రామసభ ఆమోదంతోనే తుది జాబితాను ప్రకటించాలని ఆదేశించారు.



మెక్సికో స్టోర్‌లో పేలుడు

- 23 మంది మృతి
- 11 మందికి గాయాలు

మెక్సికో సిటీ : మెక్సికోలో ఒక స్టోర్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించి 23 మంది మరణించారు. మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. సొనోరా రాష్ట్ర రాజధాని అయిన హెర్మోసిల్లో నగరం మధ్యలో ఉన్న వాల్డోస్ స్టోర్‌లో ఈ అగ్ని ప్రమాదం జరిగింది. ప్రాథమిక విచారణ ప్రచారం స్టోర్‌కు సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో ఈ మంటలు వ్యాప్తి చెందినట్లు భావిస్తున్నారు. అయితే కారణాన్ని అధికారులు ఇంకా నిర్ధారించలేదు. ఈ ప్రమాదంపై మెక్సికో అధ్యక్షులు క్లాడియా షీన్‌బామ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని, సహాయక చర్యలు వేగంగా పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు

నకిలీ మద్యం కేసులో జోగి రమేష్ అరెస్టు

- ఎక్సైజ్ కోర్టులో హాజరు



జోగి రమేష్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

ప్రజాశక్తి- ఇబ్రహీంపట్నం, హెల్త్ యూనివర్సిటీ

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కల్తీ మద్యం కేసులో ఎక్సైజ్ పోలీసులు దూకుడు పెంచారు. జోగి రమేష్‌ను ఆదివారం అరెస్టు చేసి విజయవాడ సిట్ కార్యాలయానికి తరలించారు. ఈ కేసులో ఇప్పటివరకూ జోగి రమేష్‌తోపాటు ఆయన సోదరుడు రాము, అనుచరుడు ఆరేపల్లి రాముసహా మొత్తంగా 20 మందిని అరెస్టు చేసినట్లయింది. ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ నివాసానికి చేరుకున్న ఎక్సైజ్, పోలీస్, క్లూస్ టీములతో కూడిన సిట్ బృందం విస్తృత తనిఖీలు చేసింది. జోగి రమేశ్, ఆయన భార్య ఫోన్లను సిట్ అధికారులు సీజ్ చేశారు. ఆయన నివాసంలోని సిసి ఫుటేజీలను, పలు హార్డ్ డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయన ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. తమ నాయకుడిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మూడున్నర గంటలపాటు హైడ్రామా సాగింది. పోలీసులు జోగి రమేష్‌ను అరెస్టు చేసి విజయవాడలోని ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు. రమేష్‌ను, రామును విడివిడిగా విచారించారు. జనార్ధనరావుతో ఆర్థిక సంబంధాలపై ప్రశ్నించినట్లు సమాచారం. రమేష్‌ను సుమారు ఏడు గంటల పాటు విచారించారు. ఈ కేసులో ఎ-18గా జోగి రమేష్‌ను, ఎ-19గా జోగి సోదరుడు రామును అధికారులు చేర్చనున్నారు. వారిద్దరినీ ఆదివారం రాత్రి వైద్య పరీక్షల కోసం విజయవాడలోని జిజిహెచ్‌కు తరలించారు. అక్కడికి తీసుకొస్తారనే సమాచారంతో జోగి రమేష్ అనుచరులు, వైసిపి కార్యకర్తలు ఆస్పత్రికి చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో, పోలీసులకు, వారికి మధ్య వాగ్వివాదం, తోపులాట జరగడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. వైద్యపరీక్షల అనంతరం జోగి రమేష్‌ను, రామును పోలీసులు ఎక్సైజ్ కోర్టులో హాజరుపర్చారు.

ఎస్ఐఆర్‌తో ప్రజాస్వామ్యం ఖూనీ

- సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న తమిళనాడు
- అఖిలపక్ష సమావేశంలో తీర్మానం


ఎస్ఐఆర్‌పై అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న తమిళనాడు సిఎం స్టాలిన్

చెన్నయ్ : కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేదిగా ఉందని తమిళనాడులోని అధికార డిఎంకె సహా అనేక పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. అణగారిన ప్రజల ఓట్లను తొలగించడమే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రక్రియను సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయించాయి. తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్ అధ్యక్షతన ఆదివారం ఇక్కడ నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశాయి. తొందరపాటుతో, ఏకపక్షంగా కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియను చేపడుతోందని, ఇది అప్రజాస్వామికమని, తమిళనాడు ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమని సమావేశం అభిప్రాయపడింది. బీహార్‌లో చేపట్టిన ఎస్ఐఆర్‌కు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు ఇంకా తీర్పు వెలువరించాల్సివుందని, ఇవేవీ పట్టించుకోకుండా ఎస్ఐఆర్ మలిదశను ఏకపక్షంగా చేపట్టేందుకు ఎన్నికల సంఘం సిద్ధమవ్వడం సమజసం కాదని పేర్కొంది. 'ఎస్ఐఆర్ ఆమోదయోగ్యం కాదు. ఈ ప్రక్రియను తక్షణమే నిలిపేయాలని అఖిలపక్ష సమావేశం ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తోంది. అభ్యంతరాలను, సందేహాలను తొలగించిన తర్వాత మాత్రమే ఈ ప్రక్రియను చేపట్టాలి. 2026లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన తర్వాత సుప్రీంకోర్టు సూచించిన మార్గదర్శకాలకు లోబడి అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియ చేపట్టాలి' అని సమావేశం తీర్మానించింది. ఎన్నికల సంఘం కేంద్రంలోని బిజెపి నేతృత్వ ఎన్‌డిఎ ప్రభుత్వానికి కీలుబొమ్మగా మారిందని విమర్శించింది. అందుకనే రాష్ట్రానికి చెందిన రాజకీయ పక్షాలు వెలిబుచ్చిన అభ్యంతరాలను వేటిని పట్టించుకోకుండా అప్రజాస్వామికంగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని ఆక్షేపించింది.

బీహార్‌లో ఏం జరిగిందో అదే ఇక్కడ కూడా జరుగుతుందనేది తమ ప్రధాన భయాందోళన అని ఈ సమావేశం పేర్కొంది. మైనార్టీలకు, దళిత, గిరిజనులకు చెందిన ఓట్లను ఎస్ఐఆర్ ద్వారా తొలగించారని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై స్పష్టతనివ్వడంలో అటు సుప్రీంకోర్టులోనూ, ఇటు ప్రజా వేదికల్లోనూ ఎన్నికల సంఘం విఫలమైందని తెలిపింది. తమిళనాడు, మిగతా 5లో

అమెరికా పెత్తనాన్ని నిలువరిస్తున్న సోషలిస్ట్ దేశాలు

సదస్సులో ప్రముఖ పాత్రికేయులు ప్రబీర్ పురకాయస్థ

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):
ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారని, అమెరికా పెత్తనాన్ని సోషలిస్ట్ దేశాలు నిలువరిస్తున్నాయని ప్రముఖ పాత్రికేయుడు, న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థ తెలిపారు. అన్ని దేశాలలో డాలర్ పెత్తనం కొనసాగించాలని అమెరికా చేస్తున్న ప్రయత్నాలు ఇక సాగవన్నారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభను పురస్కరించుకొని తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కార్మిక ఉద్యమ నాయకుడు కామ్రేడ్ నందూరి ప్రసాద్‌రావు స్మారక సెమినార్‌లో భాగంగా 'ప్రజాస్వామిక హక్కులపై దాడి' అనే అంశంపై సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పురకాయస్థ మాట్లాడుతూ.. ట్రంప్‌కు వ్యతిరేకంగా 70 దేశాలలో నిరసనలు తెలిపారన్నారు. తన అహంకారాన్ని తగ్గించుకొని చైనాతో అమెరికా చర్చలు జరిపిందని, చివరికి చైనా మాట అమెరికా వినక తప్పలేదన్నారు. భారతదేశంలో నూతన ఆర్థిక విధానాల వల్ల కార్మిక హక్కులపై దాడి పెరుగుతోందని వివరించారు. అమెరికాకు కేంద్ర ప్రభుత్వం జూనియర్ భాగస్వామిగా మారిందని విమర్శించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్న అన్ని పార్టీలు బిజెపికి లొంగిపోయాయని విమర్శించారు. ఇదే వైఖరి కొనసాగితే నేపాల్, శ్రీలంకలో మాదిరి కార్మికవర్గం తిరగబడే రోజులు వస్తాయని, ఈ విషయాన్ని పాలకవర్గాలు గుర్తుపెట్టుకొని వ్యవహరించాలన్నారు. కార్మిక సమస్యలను పరిష్కరించాలని, టిటిడిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. మధ్యతరగతి ఉద్యోగుల సమన్వయ కమిటీ కన్వీనర్ కెఎన్ .ఎన్ ప్రసాద్ రావు అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎస్. జయచంద్ర, టి.సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న పురకాయస్థ, పక్కన మురళి, ప్రసాద్‌రావు జి.బాలసుబ్రమణ్యం, జయచంద్ర

ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రముఖుల అభినందనలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఎల్‌విఎం3-ఎం5 ప్రయోగం విజయవంతం కావడం పట్ల గవర్నరు అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, మాజీ సిఎం వైఎస్ జగన్, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్.. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ప్రయోగం విజయవంతం కావడంతో మన దేశసత్తా మరోసారి ప్రపంచానికి తెలిసిందన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఇలాంటి ప్రయోగాలు చేసి దేశ ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

జోగి రమేష్ నకిలీ మద్యం అమ్మించారు : మంత్రి సత్యప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
మాజీ మంత్రి జోగి రమేష్ నకిలీ మద్యం తయారు చేయించి బెల్టు షాపులు, ప్రభుత్వ షాపుల్లో అమ్మించారని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాత్రధారి అద్దేపల్లి జనార్ధనరావు ముఠా అని పేర్కొన్నారు. జనార్ధనరావు ఆఫ్రికాకు వెళ్లే ముందు జోగి రమేష్ ఇంటికి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. దీనికి సంబంధించి సిసిటివి ఫుటేజీ నిజం కాదా? అని ప్రశ్నించారు. జోగి రమేష్ ప్రలోభాలతోనే 2022 నుంచి నకిలీ మద్యం తయారీని ప్రారంభించానని అద్దేపల్లి వాంగ్మూలం ఇచ్చింది నిజం కాదా? అని అన్నారు.

టెట్ నుంచి టీచర్లను మినహాయించాలి

యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులను ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయించాలని యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ డిమాండ్ చేసింది. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం మధ్యంతర కౌన్సిల్ ఆదివారం జరిగింది. ఈ సమావేశాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2010 కంటే ముందు ఉపాధ్యాయులుగా నియామకం పొందినవారు తప్పకుండా టెట్ అర్హత కావాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. 2010 కంటే ముందు అందరూ డిఎస్‌సి ద్వారా నియామకం పొందారని వివరించారు. ప్రతియేటా పాఠశాల విద్యాశాఖ నిర్వహించే శిక్షణ తరగతులకు హాజరవుతున్నారని తెలిపారు. 12, 18, 24 ఏళ్ల స్కేళ్ల కోసం ఇఒ, జిఒ పరీక్షలు రాస్తున్నామని పేర్కొన్నారు. టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని రాష్ట్రప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలన్నిటిలోనూ సమాంతర మీడియాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఎంశ్రీ తరహాలో రాష్ట్రంలో కూడా సిఎంశ్రీ పాఠశాలలను గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు.

యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. టెట్ ప్రవేశపెట్టకముందు నుంచే 2, 3 దశాబ్దాలుగా విజయవంతంగా ఉపాధ్యాయులు సర్వీసు అందిస్తున్నారు కాబట్టి మినహాయింపు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఆవరణలో ఉన్న మోడల్ ప్రైమరీ పాఠశాలలను విడదీసి 5 తరగతులకు 5 తరగతి గదులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్‌తో పాటు 20 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలని కోరారు. ప్రీ ప్రైమరీ తరగతులు బోధించేందుకు రెగ్యులర్ టీచర్లనే నియమించాలన్నారు. తగినంత ఉపాధ్యాయులు లేకపోతే అకడమిక్ ఇన్‌స్ట్రక్చర్లను నియమించే ఏర్పాటు చేయాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. విద్యాసంవత్సరం జూన్ నుంచి ప్రారంభమయినా పాఠశాలల్లో అడ్మిషన్ ప్రక్రియను ఫిబ్రవరి నుంచే చేపట్టాలని సూచించారు. విద్యార్థుల చేర్పింపులో ఉపాధ్యాయులతో పాటు విద్యా కమిటీ సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొనేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. టెట్ మినహాయించే విధంగా చర్యలు తీసుకొని, అందుకు అనుగుణంగా స్పష్టతనివ్వాలని సమావేశం తీర్మానించింది. 12వ పిఆర్‌సి కమిషన్‌ను పునరుద్ధరించి 29 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని, ఆదర్శ ప్రాథమిక పాఠశాలలన్నిటిలో ఐదుగురు ఉపాధ్యాయులను నియమించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని తీర్మానించింది. గిరిజన సంక్షేమ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని, ఎపి మోడల్ స్కూల్ టీచర్ల సర్వీస్ రూల్స్‌ను వెంటనే ప్రకటించి, వారి సమస్యలన్నీ పరిష్కరించాలని, మాతృభాషలోనే ప్రాథమిక విద్యను నిర్వహించాలని, హైస్కూళ్లలో సమాంతర మాధ్యమం ప్రవేశపెట్టాలని, హైస్కూల్ ప్లస్ పాఠశాలలు బలోపేతం చేయాలని, ఎంటిఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని కోరారు. జడ్‌పి ఉపాధ్యాయులకు జెఎల్ ఉద్యోగోన్నతులు కల్పించాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెల్త్ కార్డుల సమస్యలు వేగవంతంగా పరిష్కరించాలని తదితర తీర్మానాలను ఆమోదించింది. ఈ కార్యక్రమంలో ఆ సంఘం గౌరవాధ్యక్షులు కె శ్రీనివాసరావు, సహాధ్యక్షులు కె సురేష్‌కుమార్, కోశాధికారి రెడ్డి మోహనరావు, కార్యదర్శులు లక్ష్మీరాజా, ఎస్‌పి మనోహర్ కుమార్, ఎస్ మురళీమోహనరావు, జి సుభాషిణి, వి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

21 మంది ఐపిఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రవ్యాప్తంగా 21 మంది ఐపిఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేస్తూ జిఒఆర్‌టి నెంబరు 2029ని విడుదల చేసింది. విశాఖలో డిసిపిగా పనిచేస్తున్న కృష్ణకాంత్ పటేల్‌ను విజయవాడ ఎన్‌టిఆర్ పోలీస్ కమిషనరేట్‌లో డిసిపి లా అండ్ ఆర్డర్-1గా బదిలీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న విఎన్ మణికంఠ చందోలును విశాఖ డిసిపి లా అండ్ ఆర్డర్-1గా, అధిరాజ్‌సింగ్ రాణాను సిఐడి సైబర్ నేరాలు ఎస్‌పిగా, కె శ్రీనివాసరావును ఇంటెలిజెన్స్ ఎస్‌పిగా నియమించారు. వక్ఫ్ సర్వే కమిషనరు షేక్ ఫెరీన్ బేగంను ఎన్‌టిఆర్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ డిసిపిగా బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న ఇజి అశోక్‌కుమార్‌ను ఎసిబి జాయింట్ డైరెక్టర్‌గా, వి రత్నను సిఐడి ఎస్‌పి మహిళా భద్రతా విభాగానికి, వై రవిశంకర్‌రెడ్డిని విజయనగరం ఎపిఎస్‌పి 5వ బెటాలియన్ కమాండెంట్‌గా, ఆర్ గంగాధర్‌రావును సిఐడి ఎస్‌పిగా, టి ప్రసాద్‌రెడ్డిని ఎఐజి ఆర్గనైజేషన్‌కు, పి వెంకటరత్నంను ఎఐజి ప్లానింగ్ కో-ఆర్డినేషన్‌కు, ఎం సత్తిబాబును ఎఐజి శిక్షణకు, బి లక్ష్మీనారాయణను ఎన్‌టిఆర్ పోలీస్ కమిషనరేట్ రూరల్ డిసిపిగా నియమించారు. కెఎం మహేశ్వరరాజును ఈగల్ ఎస్‌పిగా, కృష్ణ ప్రసన్నను ఎన్‌టిఆర్ పోలీస్ కమిషనరేట్ సైబర్ నేరాలు డిసిపిగా, జగదీష్ అడహల్లిని సిఎం సెక్యూరిటీ గ్రూప్ ఎస్‌పిగా, పంకజ్ కుమార్ మీనాను అల్లూరి సీతారామరాజు అడిషనల్ ఎస్‌పి (ఆపరేషన్స్)గా, సురన అంకిత మహావీర్‌ను శ్రీసత్యసాయి జిల్లా అదనపు ఎస్‌పి (అడ్మిన్)గా, ఆర్ సుస్మితను జంగారెడ్డి గూడెం ఎఎస్‌పిగా, హేమంత్‌బొడ్డును చింతూరు ఎఎస్‌పిగా, మనీషా వంగలరెడ్డిని పార్వతీపురం ఎఎస్‌పిగా ప్రభుత్వం బదిలీ చేసింది.

విజ్ఞాన సముద్రుడు ఆరుద్ర

- ఆయన స్పృశించని సాహితీ ప్రక్రియ లేదు
- ప్రముఖ సాహితీవేత్త తెలకపల్లి రవి
- విశాఖలో ఆరుద్ర శత జయంతి ముగింపు ఘన నివాళి


సభలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి, వేదికపై ఎంవిఎస్.శర్మ, చీకటి దివాకర్, సత్యాజీ తదితరులు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో
ప్రజా కవిత్వం, సినీ సాహిత్యంతోపాటు నృత్యం, చదరంగం, ఇంద్రజాలం వంటి ప్రక్రియల్లో ప్రతిభావంతుడు, ప్రజాచైతన్యం కోసమే తన ప్రజ్ఞాపాటవాలను అంకితం చేసిన అరుదైన మహారచయిత ఆరుద్ర అని ప్రముఖ సాహితీవేత్త, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి అన్నారు. ఆయన విజ్ఞాన సముద్రుడు అని కొనియాడారు. ఆదివారం విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆరుద్ర శతజయంతి సభ సాహితీ స్రవంతి ఆధ్వర్యాన చీకటి దివాకర్ అధ్యక్షతన జరిగింది. సమగ్ర ఆంధ్ర సాహిత్య సంపుటాల సృష్టికర్త, తెలుగు కవిత్వాన్ని పరిశోధనలో, సినీ గీతాల్లో కొత్త పుంతలు తొక్కించిన ప్రజా రచయిత, కవి, మహా పరిశోధకుడు ఆరుద్ర శత జయంతి ముగింపు సందర్భంగా ఆ మహనీయునికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఈ సభకు ప్రధాన వక్తగా హాజరైన తెలకపల్లి రవి మాట్లాడుతూ విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి గురజాడ, శ్రీశ్రీ, ఆరుద్ర వంటి ప్రజా ఉద్దండులు ఉద్భవించడం ఈ ప్రాంత అదృష్టమని, వారి మహోన్నత వారసత్వం నవ్యాంధ్రకు కొత్త చైతన్యం అందిస్తూనే ఉంటుందని అన్నారు. ఆరుద్రను తలచుకోవడం అంటే తెలుగు భాష అభివృద్ధికి పాటుపడడమేనని పేర్కొన్నారు. ఏ విశ్వవిద్యాలయాలూ చేయలేని సమగ్రాంధ్ర సాహిత్యాన్ని 14, 15 సంపుటాల్లో రచించి సమాజానికి అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఈ సభలో ఆరుద్ర సాహిత్యంలో పలు కోణాలను ఆవిష్కరిస్తూ, ఆరుద్ర రాసిన సినీగేయాలను అలవోకగా తన స్వరంతో రవి పాడి సభికులను రంజింపజేశారు. సమాజాన్ని ఒక అడుగు ముందుకు వేయించడానికి ఆరుద్ర రచనలు దోహదపడతాయని తెలిపారు. ఏదైనా శోధించి సాధించే ధీరగుణం ఉండాలని ఆరుద్ర కోరుకున్నారని, కష్టజీవులు సంపద సృష్టిస్తారని, కలవారు దారిద్ర్యాన్ని పంచుతారన్న ఆరుద్ర రచనా శైలి ప్రజాదృష్టికి దర్పణం పడుతోందని వివరించారు. విశాఖలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ ఫొటో కన్ను ద్వారా ప్రపంచాన్ని ఆరుద్ర ఆవిష్కరించారన్నారు. శ్రీశ్రీ, గురజాడ, కృష్ణశాస్త్రి, ఆరుద్ర, కందుకూరి వంటి సాహితీ యోధులు తెలుగు భాషకు, అభివృద్ధికి ప్రాణం పోసి ఊపిరిలూదారని, ఆ మహాకవులను తలచుకోవడమే కాకుండా ప్రభుత్వం జరిపే జయంతులు, ఉత్సవాలు, పండగల్లో వారిని చేర్చి వారి అభ్యుదయ, మానవీయ కవిత్వాన్ని ప్రజలకు అందించాలని రవి ఆకాంక్షించారు. 'కమ్యూనిస్టుగా నేను' అని స్వయంగా ఆరుద్ర రాసిన పుస్తకాన్ని సభా వేదికపై ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, సాహితీవేత్తలు చీకటి దివాకర్, సత్యాజీ, ఉప్పల అప్పలరాజు పాల్గొన్నారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి

యాత్రికుల భద్రతకు ప్రాధాన్యం

- దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం
- వైద్య కళాశాలల మాదిరిగా ప్రైవేటు ఆలయాలను పట్టించుకోరా?: వైసిపి

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)
రాష్ట్రంలోని ఆలయాల్లో యాత్రికుల ప్రాణభద్రతకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని, ప్రతి ఉత్సవానికి ముందే భద్రతపై సమీక్ష చేపడతామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ అన్న తేడా లేకుండా అన్ని ఆలయాలకు భద్రతా జాబితా సిద్ధం చేస్తామని తెలిపారు. యాత్రికుల భద్రత, ఏర్పాట్లు, ప్రవేశ మార్గాలు, అత్యవసర సేవలపై తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాట ఘటన స్థలాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీషతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరులతో మంత్రి మాట్లాడుతూ... ప్రైవేట్, ప్రభుత్వ ఆలయాలపై బాధ్యతగా స్పందిస్తామని, మృతుల కుటుంబాలకు దేవాదాయశాఖ తరపున ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నానని అన్నారు. ఈ ఘటనపై విచారణ కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. కలెక్టర్ నివేదిక ఆధారంగా ఆలయ అభివృద్ధి చర్యలు ప్రారంభిస్తామని తెలిపారు.

చెక్కుల పంపిణీ
మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను పంపిణీ చేశారు. వజ్రపు కొత్తూరు, నందిగాం, టెక్కలిలో ఇద్దరికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు అందజేశారు. మందసలో ముగ్గురికి మంత్రి ఆనం, పలాసలో ఎమ్మెల్యే శిరీష్, సోంపేటలో బెందాళం అశోక్ పంపిణీ చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన రూ.2లక్షల చెక్కును త్వరలో అందజేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు.


శ్రీకాకుళం జెమ్స్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న కె లోకనాథం, గోవిందరావు, కృష్ణమూర్తి

క్షతగాత్రులకు సిపిఎం పరామర్శ
తొక్కిసలాటలో మృతి చెందిన కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.25 లక్షల నష్టపరిహారం, క్షతగాత్రులకు రూ.ఐదు లక్షలు, ఉచిత వైద్యం అందించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు, సిపిఎం నాయకులు ఎన్.గణపతి డిమాండ్ చేశారు.

మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. శ్రీకాకుళంలోని జెమ్స్ ఆస్పత్రిలోనూ, పలాస సిహెచ్‌షిలోనూ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ, అసంపూర్తిగా నిర్మించిన ఆలయం ప్రారంభానికి అనుమతి ఇవ్వడం సరైంది కాదన్నారు. నిర్మాణంలో నాణ్యత లేదని, వేలాది మంది రావడానికి అవసరమైన బారికేడ్లు కూడా లేకపోయినా ఎలా అనుమతినిచ్చారని ప్రశ్నించారు. క్షతగాత్రులు కోలుకునే వరకూ ఉచితంగా మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, నాయకులు ఎన్.గణపతి, టి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.


పలాసలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న బొత్స సత్యనారాయణ, కృష్ణదాస్

సిట్టింగ్ జడ్జితో విచారణ : బొత్స డిమాండ్
కాశీబుగ్గ ఘటనపై సిటింగ్ జడ్జితో దర్యాప్తు చేయించాలని మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. తిరుపతి, సింహాచలం ఆలయాల్లో జరిగిన ఘటనలు మరిచిపోకముందే కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొమ్మిది మంది మరణించడం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, సీదిరి అప్పలరాజుతో కలిసి ఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బొత్స మాట్లాడుతూ..మెడికల్ కళాశాలల మాదిరిగా ప్రైవేటు ఆలయాలను పట్టించుకోరా? అని ప్రశ్నించారు. బాధితులకు వైసిపి అండగా ఉంటుందని, సహాయక చర్యలు చేపడతామని తెలిపారు.


రైతు, కార్మిక సంఘాల రాష్ట్ర నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

తుపాను బాధిత రైతులను తక్షణమే ఆదుకోవాలి : వడ్డే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
తుపాను వల్ల నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని ఎపి సంయుక్త కిసాన్ మోర్చా (ఎపిఎస్‌కెఎం) కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం రైతు, కార్మిక సంఘాల రాష్ట్ర నాయకుల సమావేశం జరిగింది. సమావేశానంతరం ఆయన మాట్లాడుతూ.. పంటల నష్టాన్ని సక్రమంగా ఎన్యూమరేషన్ చేయించాలని, రైతులను ఆదుకునేందుకు ఇన్‌పుట్ సబ్సిడీ ఆహార పంటలకు ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు, ఉద్యాన పంటలకు రూ.75 వేలు చొప్పున రైతు, కౌలు రైతులకు పంటబీమా వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం.. సంయుక్త కిసాన్ మోర్చాకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. మూడు నల్ల వ్యవసాయ చట్టాలకన్నా ప్రమాదకరమైన విధానాలను రూపొందించిందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు వారికి అనుకూలంగా 2025 విద్యుత్ సవరణ చట్టం ప్రకటించిందని విమర్శించారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. 2025 విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించాలని, స్మార్ట్ మీటర్లు వద్దని, ఉచిత విద్యుత్, విద్యుత్ సబ్సిడీలు కొనసాగించాలని అన్నారు. రైతాంగానికి, కార్మికులకు నష్టమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. రైతుల నుంచి నిర్బంధ, భూసేకరణ నిలిపివేయాలని, పరిశ్రమలు పెట్టని భూములను రైతులకు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు సుధీర్ మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విధానాలు అమలుపరచడంలో ముందువైపు నిలబడుతుందన్నారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ ఛైర్మన్ కామన ప్రభాకరరావు మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, 13 గంటల పని విధానం జిఒని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కిసాన్‌సభ రాష్ట్ర నాయకులు డి హరినాథ్ మాట్లాడుతూ.. పనికి ఆహార పథకాన్ని 200 రోజులకు వర్తింపజేయాలని, రోజువారీ వేతనం రూ.700లకు పెంచాలన్నారు. రైతు సంఘం సీనియర్ నాయకులు చుండూరు రంగారావు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్లకు వినతిపత్రాలు అందించాలని కోరారు. మీడియా సమావేశంలో నల్లమడ రైతు సంఘం రాష్ట్ర నాయకులు రాజమోహన్, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం రామకృష్ణ, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్‌బాబు, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కెవన్ రాజు, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

సిఐటియు పోరాట విజయం

- అంబేద్కర్ స్మృతివనం కార్మికుల జీతాల చెల్లింపునకు ఏజెన్సీ అంగీకారం


కార్మికులకు చెక్కును అందజేస్తున్న కాశీనాథ్, ఏజెన్సీ నిర్వాహకులు

ప్రజాశక్తి-విజయవాడ
అంబేద్కర్ స్మృతివనం కాంట్రాక్టు కార్మికుల పోరాటం ఫలించింది. పెండింగ్ జీతాలు చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో 30 రోజుల పాటు చేసిన పోరాటానికి యాజమాన్యం దిగివచ్చింది. తొమ్మిది నెలలకు ఆరు నెలల జీతం చెల్లించేందుకు ఆర్కే ఏజెన్సీ సర్వీస్ అంగీకరించింది. రెండవ రోజు దీక్షను ప్రారంభించిన సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి, ఆర్కే సర్వీస్ ఏజెన్సీ చేతుల మీదుగా కార్మికులకు ఆరు నెలలు జీతాలను కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా కాశీనాథ్, మాల్యాద్రి మాట్లాడుతూ.. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల జీతాలు ఇవ్వాలని కార్మికులు, సిఐటియు నాయకులు అనేక రూపాల్లో ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల పోరాట ఫలితంగా 21 మంది కార్మికులకు పెండింగ్ జీతాలు లభించాయని తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

- ముంపు ప్రాంతాల్లో రైతుసంఘం నేత కృష్ణయ్య పర్యటన

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)
మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం నికరంపల్లి, పెద్ద నాగులవరం, వేములకోట ఇలాఖాల్లోని పంట పొలాలను ఎపి రైతుసంఘం ప్రతినిధి బృందం ఆదివారం సందర్శించింది. అక్కడి రైతులతో నాయకులు మాట్లాడారు. పత్తి, మిర్చి, ఇతర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వి కృష్ణయ్య మాట్లాడుతూ మొంథా తుపానుతో జరిగిన నష్టాన్ని ప్రభుత్వమే పూడ్చాలని డిమాండ్ చేశారు. గత 20 ఏళ్లలో ఇంతటి వర్షం చూడలేదంటూ ఇక్కడి రైతులు చెప్పారన్నారు. జిల్లా యంత్రాంగమే పర్యటించి సరిపెట్టొద్దని, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు రైతన్నల విషయంలో సీరియస్‌గా తీసుకోవాలన్నారు. పత్తి పంటకు ఒక్కో ఎకరానికి రూ. 30 వేలు, మిర్చికి ఎకరానికి రూ. 50 వేలు తగ్గకుండా నష్టపరిహారం అందజేయాలని కోరారు. మిగిలిన పంటలకు ఎకరానికి రూ.10 వేల చొప్పున ఇవ్వాలన్నారు. ఆ విధంగా ఆదుకోకపోతే రైతన్నలు కోలుకోవడం కష్టమని పేర్కొన్నారు. కౌలు రైతులు తీవ్రంగా దెబ్బతిన్నారని, సాగులో ఉన్న కౌలు రైతుకు మాత్రమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పర్యటనలో ఎపి రైతు సంఘం నాయకులు డి సోమయ్య, యేర్వ పాపిరెడ్డి, ఓర్సు అడివయ్య, గంగిరెడ్డి రాజశేఖరరెడ్డి, జనమాల నాగయ్య, పెద్ద నాగులవరం మాజీ సర్పంచి పిన్నిక అల్లూరయ్య తదితరులు పాల్గొన్నారు.

'మొంథా'తో నష్టపోయిన చేనేతలకు రూ.5 వేలు : మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
మొంథా తుపాను వల్ల నీట మునిగిన నూలు, రంగులు, రసాయనాలకు నష్టపరిహారంగా రూ.5 వేలు చొప్పున చెల్లిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. వర్షాలు కారణంగా ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికుల కుటుంబాలకు 50 కిలోల బియ్యం, లీటరు పామాయిల్, కేజీ కందిపప్పు, ఉల్లిపాయలు, పంచదార అందిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సర్వేలో 27,982 చేనేత కుటుంబాలు తుపాను బాధిత కుటుంబాలుగా అధికారులు గుర్తించారన్నారు. 718 మందికి చెందిన నూలు, రంగులు, రసాయనాలు, తదితర వస్తువులు నీటిలో తడిచి దెబ్బతిన్నట్లు వెల్లడించారు. వీరికి రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.35.90 లక్షలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. నీట మునిగిన 3 మగ్గాల బాధితులకు రూ.10 వేలు చొప్పున పంపిణీ చేస్తామన్నారు. బాపట్ల జిల్లాలో అత్యధికంగా 8,567 మంది చేనేత కుటుంబాలు తుపాను వల్ల నష్టపోగా, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 4,278 కుటుంబాలు, కృష్ణా జిల్లాలో 3,900 కుటుంబాలు, శ్రీకాకుళం జిల్లాలో 3,333 కుటుబాలు ఉన్నాయని వెల్లడించారు.

నేటి నుంచి ఆత్మీయ సమావేశాలు
ఆదరణ 3.0లో చేతి వృత్తిదారులకు అత్యాధునిక పరికరాలు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో సోమవారం నుంచి 3 రోజులపాటు 34 బిసి కార్పొరేషన్ల ఛైర్మన్లతో గొల్లపూడిలోని బిసి భవన్‌లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించనున్నట్లు బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఈ సమావేశాల్లో ఆయా కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్లు, కుల సంఘాల పెద్దల నుంచి సూచనలు, సలహాలు తీసుకుని 'ఆదరణ' పరికరాలను అందజేస్తామన్నారు.

మైపాడు బీచ్‌లో ముగ్గురు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి -ఇందుకూరుపేట (నెల్లూరు జిల్లా)

నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మడలం మైపాడు బీచ్‌లో సరదాగా స్నానికి దిగి ముగ్గురు ఇంటర్ విద్యార్థులు ప్రమాదవశాత్తూ మతి చెందిన విషాద సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపిన వివరాల మేరకు నెల్లూరు నగరంలోని కొట్టమిట్టకు చెందిన పటాన్ ఉమాయున్ (17). సమీద్ (17), నారాయణరెడ్డి పేటకు చెందిన మహమ్మద్ తజీమ్ (17) ఓ ప్రయివేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ముగ్గురు స్నేహితులు ఆదివారం సరదాగా మైపాడు బీచ్‌కు వెళ్లి సరదాగా స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ప్రమాదవశాత్తూ వారు సముద్రం లోపలికి కొట్టుకుపోయారు. కొద్ది క్షణాల్లోనే వారు విగతజీవులుగా ఒడ్డుకు కొట్టుకొచ్చారు. ఈ ఘటనపై మృతుల కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జిజిహెచ్‌కి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కాల్చివేతకు సిద్ధంగా ఉంచిన గంజాయిని పరిశీలిస్తున్న డిజిపి హరీష్ కుమార్ గుప్తా

రూ.5.21 కోట్ల విలువైన గంజాయి కాల్చివేత

ప్రజాశక్తి -మధురవాడ (విశాఖపట్నం)

విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 529 కేసుల్లో పట్టుబడిన రూ. 5.21 కోట్ల విలువైన గంజాయిని పోలీసులు ఆదివారం కాపులుప్పాడ డంపింగ్ యార్డులో పూర్తిగా కాల్చివేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ గంజాయి నిర్మూలనలో పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. నార్త్ జోన్ ఎసిపి అప్పలరాజు ఆధ్వర్యంలో సాగిన ఈ కార్యక్రమంలో 10,147.590 కిలోల గంజాయిని, 19.31 లీటర్ల హాషిష్ ఆయిల్‌ను, కిలో ఒపిఎంను కాల్చివేశారు. విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఈగల్ ఐజి రామకృష్ణ, వివిధ జోన్ల ఎసిపిలు, సిఐలు, ఎస్ఐలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరిని బలిపశువు చేస్తారు?

- **పోలీసుల అదుపులో ఇద్దరు తాపీ మేస్త్రీలు**

ప్రజాశక్తి- పలాస (శ్రీకాకుళం జిల్లా)

కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జరిగిన తొక్కిసలాట ఘటనకు తప్పు ఎవరిదనే దానిపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. దేవుని దర్శనం కోసం వచ్చిన యాత్రికుల్లో ఎనిమిది మంది మహిళలు, ఒక బాలుడు మృతి చెందడంతో పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల ప్రజలతోపాటు వివిధ మండలాల ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఓ వృద్ధుడు ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్వాహకుల, పోలీసుల వైఫల్యం వల్లే ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఆలయ నిర్మాణ పనుల కోసం వచ్చిన తాపీ మేస్త్రీలను పోలీసులు అదుపులో తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం పనులు చేస్తున్న తాపీ మేస్త్రీలు కణితి ప్రకాశరావు, పొందర చక్రపాణిలను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, కూలి పనికి వస్తున్న తాపీమేస్త్రీలను బలిపశులను చేయాలని చూడడం ఎంతవరకు న్యాయమని యాత్రికులు ప్రశ్నిస్తున్నారు.

కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులు

కాశీబుగ్గకు చెందిన హరి ముకుంద పండా తన సొంత తోటలో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మాణం చేపట్టారు. వెంకటేశ్వరస్వామి విగ్రహం, వివిధ రకాల దేవుళ్ల విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఇంకా మరికొన్ని విగ్రహాల ఏర్పాటుతోపాటు యాత్రికులకు మౌలిక సదుపాయాల కల్పన కోసం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయినా, దర్శనానికి అనుమతి ఇస్తున్నారు. కార్తీకమాసం ఏకాదశి కావడంతో మహిళలు పెద్ద సంఖ్యలో వెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతోపాటు టెక్కలి, మెళియాపుట్టి, సోంపేట, మందస, నందిగాం, వజ్రపుకొత్తూరు మండలాల నుంచి కూడా ఆలయానికి పోటెత్తారు. ఉదయం నుంచి సంఖ్య కొంచెం కొంచెంగా పెరగడంతో రద్దీ విపరీతంగా పెరిగింది. క్యూలైన్‌ను నియంత్రించేందుకు పోలీసులు లేకపోవడంతోనే తొక్కిసలాట జరిగిందని, తొమ్మిదిమంది మృత్యువాత పడ్డారని యాత్రికులు అంటున్నారు. పోలీసులు కేవలం వాహనాల పార్కింగ్ విధులకే పరిమితం అయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయ నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో జరగకముందే దర్శనాలకు అనుమతి ఇవ్వడం చర్చనీయాంశమైంది.



ఆలయం వద్ద పహారా కాస్తున్న పోలీసులు

ఆలయాన్ని మూసివేసి పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అక్కడ పహారా కాస్తున్నారు.

పోలీసుల వైఫల్యమే?

ఇటీవల కాలంలో ప్రజల మాటలలోనే ప్రాచుర్యం పొంది రోజుకు వెయ్యి నుంచి రెండు వేల వరకు మంది యాత్రికులు వెంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుంటున్నారు. కార్తీక మాసం దశమి, ఏకాదశి, ద్వాదశి వంటి రోజుల్లో వీరి తాకిడి అధికంగా ఉంటోంది. ఈ విషయం పోలీసులకు తెలిసినా తమకేమీ సంబంధం లేనట్లు వ్యవహరించడం వల్లే తోపులాట ఘటన జరిగిందని యాత్రికులు విమర్శిస్తున్నారు.

ఎస్‌సి, ఎస్‌టి పారిశ్రామికవేత్తలకు రాయితీలు విడుదల చేయండి

- **సిపిఐ డిమాండ్**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు రాయితీలను నూరు శాతం వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. 7,675 దళిత, 1,320 గిరిజన పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం రూ.1,200 కోట్ల రాయితీలను తక్షణమే విడుదల చేయాల్సి ఉందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి రాయితీలు అందకపోవడంతో దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు రాష్ట్రం స్వర్గధామమని దేశ విదేశాల్లో పెట్టుబడిదారుల వెంటపడి అనేక రాయితీలు కల్పిస్తుందని, రాష్ట్రానికి చెందిన దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు ఏళ్ల తరబడి రాయితీలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేయడం సరైందికాదని అన్నారు. గత నాలుగేళ్లుగా వీరికి ఒక్క రూపాయి చెల్లించకపోవడం దుర్మార్గమని వెల్లడించారు. విశాఖ భాగస్వామ్య సదస్సుకు రూ.300 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, దళిత, గిరిజన పారిశ్రామికవేత్తల రాయితీల చెల్లింపునకు కేవలం రూ.206 కోట్లు కేటాయించడాన్ని తప్పుబట్టారు.

పంప్డ్ స్టోరేజీతో సాగునీటికి ఎసరు!

- **తోటపల్లి, వెంగళరాయ సాగర్ నీరు తరలింపునకు సన్నాహాలు**

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

పంప్డ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం దుగ్గేరు వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేస్తామంటున్న పంప్డ్ స్టోరేజీ వల్ల సాగునీటి ఇబ్బందులు తలెత్తనున్నాయి. ఇప్పటికే చివరి ఆయకట్టుకు సాగునీరు అందకపోతుండగా, పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన నీటిని తోటపల్లి, వెంగళరాయసాగర్ ద్వారా దుగ్గేరుకు మళ్లించనున్నారు. అక్కడ స్టోరేజీ ఏర్పాటుకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. పవర్ ప్రాజెక్టును గిరిజనులు, స్థానికులు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నారు. 64 వేల ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరిస్తూనే కుడికాలువ ద్వారా అదనంగా 1,46,221 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో తోటపల్లి ప్రాజెక్టును 20 ఏళ్ల క్రితం నిర్మించారు. ఇందులో ఈ ఏడాది 80 వేల ఎకరాలకు మించి సాగునీరు అందలేదు. మరోవైపు వెంగళరాయసాగర్ నీరు చివరి ఆయకట్టు వరకు వెళ్లడం లేదు. దీంతో, ఇప్పటికే దశాబ్దాల తరబడి సాగునీటి కోసం ఎదురు చూస్తున్న రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో హైడ్రో ప్రాజెక్టు కోసం ఈ రెండు జలాశయాల నుంచి 24 ఎంజిఎంల (దాదాపు ఒక టిఎంసి) నీటిని మళ్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. పంప్డ్ స్టోరేజీ కోసం నీటిని మళ్లిస్తే అందుతున్న సాగునీటిలో మరో పది వేల ఎకరాలకు నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు, విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం పరిధిలోని 14 వేల ఎకరాలు, చీపురుపల్లి నియోజకవర్గంలో 25 వేల ఎకరాలు, గజపతినగరం నియోజకవర్గం పరిధిలోని 15 వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదు. తాజాగా ప్రభుత్వం నిర్ణయం అమల్లోకి వస్తే పార్వతీపురం, బొబ్బిలి నియోజకవర్గాల్లోనూ సాగునీటికి ఇబ్బందులు తలెత్తే ప్రమాదముంది.



తోటపల్లి కాలువ



విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలు -2025లో భాగంగా విజయవాడ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎసిబి డైరెక్టర్ జనరల్ అతుల్‌సింగ్ తదితరులు

అవినీతిపై పోరాటానికి ప్రతి ఒక్కరూ కలిసి రావాలి

- **ఎసిబి డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమాజాభివృద్ధికి అవినీతి అవరోధంగా మారిందని, సమాజం నుంచి అవినీతిని పారదోలేందుకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని ఎసిబి డైరెక్టర్ జనరల్ అతుల్‌సింగ్ పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలు -2025లో భాగంగా విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ వారోత్సవాల్లో సైకిల్ ర్యాలీని చేపట్టామన్నారు. ఇటువంటి ర్యాలీలు తిరుపతి, విశాఖలో కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అవినీతి అనేది ఇచ్చేవారు, తీసుకునేవారిపై ఆధారపడి ఉంటుందన్నారు. అవినీతిపై ఫిర్యాదు చేయాలనుకునే వారు 1064 నెంబరుకు కాల్ చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిబి డైరెక్టర్ ఆర్ జయలక్ష్మి, హెడ్ క్వార్టర్స్ అడిషనల్ ఎస్‌పి సుధాకర్, అడిషనల్ ఎస్‌పిలు మహేందర్, దిలీప్, కిరణ్ పాల్గొన్నారు.

పెండింగ్ ఫీజులు విడుదల చేయాలి

- **ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ట్యూషన్ ఫీజులను విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ కాలేజ్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె రమణజి, జి రాజ్‌కుమార్ చౌదరి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24, 2024-25 విద్యాసంవత్సరాలకు సంబంధించిన విద్యార్థుల ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్(ఆర్‌టిఎఫ్) మొత్తంలో 6 విడతలు, 2025-26 సంవత్సరంలో 2 విడతల ఫీజులు ఇప్పటికీ విడుదల కావాల్సి ఉన్నాయని వివరించారు. సెప్టెంబర్‌లో ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం అక్టోబర్ నెలలో పెండింగ్‌లో ఉన్న పాత ఫీజులలో ఒక విడత విడుదల చేయాల్సి ఉందని గుర్తుచేశారు. అలాగే ఫీజుల విడుదలకు సంబంధించిన క్యాలెండర్ తేదీలను కూడా ప్రభుత్వం ప్రకటించాలని తెలిపారు. అయితే ఇప్పటి వరకు ఫీజుల విడుదలపై ఎటువంటి అధికారిక ప్రకటన ప్రభుత్వం చేయలేదని పేర్కొన్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ ఫీజులను విడుదల చేసి ఉన్నత విద్యాసంస్థలకు ఆర్థిక సహాయం అందించాలని,విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే పరిస్థితులను కల్పించాలని కోరారు.ప్రభుత్వం వచ్చే ఐదేళ్లల్లో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే సంకల్పాన్ని నెరవేర్చాలంటే ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు సమయానుకూలంగా ఆర్థిక సహాయం అందించడం అవసరమని పేర్కొన్నారు. అప్పుడు మాత్రమే విద్యాసంస్థలు విద్యార్థులను సరైన నైపుణ్యాలతో ఉద్యోగాలకు సిద్ధం చేయగలవని తెలిపారు. విద్యాసంస్థల విన్నపాన్ని పరిగణనలోకి తీసుకుని పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు 2025-26 విద్యాసంవత్సరం ఫీజు విడుదలకు క్యాలెండర్‌ను కూడా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

APRCET 2024-25 MODEL PAPER



T.PRAMOD KUMAR
MCA.,(Ph.D.)., APSET, UGC-NET, APRCET
APJ ABDUL KALAM PRATHIBHA AWARDEE
Cell : 8074651414

Research Methodology
Section- A

1. According to N.L. Gage, teaching is a process that:
A) Involves guidance and direction
B) Produces immediate behavioral change
C) Is limited to the curriculum
D) Is a mechanical activity
Answer: A

2. Which of the following represents the correct order of levels of teaching (from lowest to highest)?
A) Reflective-Understanding-Memory
B) Understanding-Memory-Reflective
C) Memor-Understanding-Reflective
D) Memory-Reflective-Understanding
Answer: C

3.Effective teaching requires primarily:
A) Good communication and empathy
B) Strict discipline
C) Use of technology only D) Continuous lecturing
Answer: A

4.Adolescent learners are primarily characterized by:
A) Dependence and conformity
B) Curiosity, self-identity, and social sensitivity
C) Lack of motivation D) Preference for rote learning
Answer: B

5. Support materials in teaching primarily aim to:
A) Decorate classrooms
B) Supplement and clarify teaching content
C) Replace the teacher D) Entertain students
Answer: B

6.MOOCs are characterized by:
A) Restricted enrollment and paid access
B) Massive, open, and online accessibility
C) Local offline participation only
D) Limited course diversity
Answer: B

7.Criterion-referenced evaluation focuses on:
A) Comparing individuals to set standards or learning objectives
B) Comparing with class averages
C) Assigning ranks
D) Rewarding top scorers only
Answer: A

8.Delphi technique is primarily used in:
A) Experimental research
B) Predictive and policy research
C) Historical research D) Laboratory research
Answer: B

9.The distinguishing feature of applied research is:
A) Use of sophisticated statistical tools
B) Focus on practical problem-solving
C) Use of large sample sizes
D) Dependence on secondary data
Answer: B

10.The post-positivist researcher believes that:
A) Reality is completely subjective
B) Truth can never be known with certainty
C) Research must be value-free
D) Theories need not be tested empirically
Answer: B

11.In experimental research, the key feature that distinguishes it from other methods is:
A) Use of large samples
B) Control and manipulation of variables
C) Reliance on secondary data
D) Use of qualitative data
Answer: B

12.Which of the following represents the correct order of research steps?
A) Data collection-Hypothesis- Review literature-Interpretation
B) Identification of problem-Review literature-Hypothesis-Design-Data collection-Analysis-Interpretation-Report
C) Hypothesis-Data collection-Problem identification-Analysis
D) Review literature-Data collection-Interpretation-Hypothesis
Answer: B

13.The use of cloud-based data storage in research primarily facilitates:
A) Ethical referencing
B) Data sharing and collaboration
C) Hypothesis testing D) Statistical analysis
Answer: B

14.Plagiarism can be best avoided by:
A) Using synonyms for copied text
B) Rewriting ideas without citations
C) Proper paraphrasing and referencing sources
D) Using unpublished sources only
Answer: C) Proper paraphrasing and referencing sources

15.Reference management software like Zotero or Mendeley helps researchers in:
A) Statistical computation B) Data visualization
C) Organizing citations and bibliographies
D) Hypothesis formulation
Answer: C

Comprehension Passage
Read the passage carefully and answer the questions:
In recent years, the proliferation of digital technologies has transformed not only how knowledge is produced but also how it is validated and disseminated. Traditional models of research, grounded in institutional hierarchies and peer review, are increasingly being challenged by open-access platforms and preprint repositories that democratize access to information. While such openness accelerates the pace of discovery and encourages collaboration, it simultaneously raises concerns about the credibility and reproducibility of research findings. The absence of rigorous peer evaluation in many open-access outlets may allow the diffusion of unverified or flawed data, which can mislead both policymakers and the public.
However, to dismiss open access as a threat to academic rigor would be shortsighted. The evolving landscape demands that researchers and institutions redefine their roles — moving from being mere gatekeepers of knowledge to facilitators of transparent and ethical scholarship. The challenge lies not in resisting technological change but in creating new norms of accountability and verification that preserve both accessibility and integrity.

16. The phrase "democratize access to information" implies:
A) Making research free from any academic control
B) Ensuring equal opportunity for everyone to access knowledge
C) Replacing universities with public databases
D) Eliminating the role of experts in validating research
Answer: B

17. The author's stance toward open-access publishing can best be described as:
A) Completely supportive B) Strongly dismissive
C) Cautiously optimistic D) Indifferent
Answer: C

18.The term "gatekeepers of knowledge" is used in the passage to refer to:
A) Academic libraries
B) Peer reviewers and editorial boards
C) Information technology professionals
D) Research funding agencies
Answer: B) Peer reviewers and editorial boards

19.The expression "shortsighted" in the context of the passage means:
A) Narrow-minded and lacking long-term vision
B) Having limited access to information
C) Technically obsolete D) Ethically biased
Answer: A

20.Which of the following best captures the main idea of the passage?
A) Technological innovation is undermining academic standards
B) Open-access research should replace traditional publishing
C) Digital transformation requires new standards of academic accountability
D) Peer review is no longer relevant in the digital age
Answer: C

21.The transactional model of communication best represents classroom interaction because it:
A) Emphasizes one-way flow
B) Considers communication as dynamic and reciprocal
C) Ignores feedback
D) Views students as passive receivers
Answer: B

22.Which of the following is not a characteristic of effective communication?
A) Clarity of expression B) Feedback
C) Ambiguity D) Conciseness
Answer: C

23.The primary function of kinesics is:
A) Regulating verbal interaction through body movement
B) Managing mass communication
C) Transmitting written messages
D) Structuring communication networks
Answer: A

24.Ethnocentrism in communication means:
A) Appreciating all cultures equally
B) Believing one's culture is superior to others
C) Avoiding intercultural communication
D) Adapting to multicultural settings
Answer: B

25.Hypodermic needle theory assumes:
A) Audiences actively interpret messages
B) Media messages have uniform, powerful effects on passive audiences
C) Cultural context shapes meaning
D) Media impact varies individually
Answer: B

26.Psychological barriers in communication arise mainly from:
A) Language differences
B) Prejudices, emotions, and selective perception
C) Faulty channels
D) Time constraints
Answer: B

27.Intercultural communication competence primarily requires:
A) Strong vocabulary
B) Awareness of cultural norms and empathy
C) Aggressive persuasion
D) Technological proficiency
Answer: B

28.Framing in mass media means:
A) Selecting and emphasizing certain aspects of reality to shape interpretation
B) Presenting news without bias
C) Censoring undesirable content
D) Encouraging multiple interpretations
Answer: A

29.Which of the following conclusions follows logically from the statements?
Statements:
· All scientists are thinkers.
· Some thinkers are philosophers.
Conclusions:
I. Some scientists are philosophers.
II. Some philosophers are thinkers.
A) Only I follows B) Only II follows
C) Both I and II follow D) Neither follows
Answer: B

30.The fallacy in the argument "All cats are animals; all dogs are animals; therefore all cats are dogs" is due to:
A) False premise B) Faulty syllogism
C) Circular reasoning D) Contradiction
Answer: B

31.If the ratio of speeds of two trains is 3:4, and the first train covers 360 km in 4 hours, find the time taken by the second train to cover 480 km.
A) 3 hours B) 2.5 hours C) 2 hours D) 4 hours
Answer: D

32.A shopkeeper buys an article at ?240 and marks it 25% above cost price. If he gives a discount of 10%, find his profit percentage.
A) 12.5% B) 15% C) 11.25% D) 10%
Answer: A

33.5, 7, 11, 19, 35, ?
A) 59 B) 63 C) 67 D) 71
Answer: B) 63

34.M is the son of N. O is the daughter of P. N and P are married and have only two children. How is M related to O?
A) Brother-sister B) Cousins
C) Uncle-niece D) Not related
Answer: A

35.The average marks of 40 students in a class are 65. Later it was found that one mark 72 was wrongly taken as 27. What is the correct average?
A) 66.125 B) 66.25 C) 66.5 D) 67
Answer: A

36.In a certain code, COMPUTER is written as RFUVQNPC. How is MEDICINE written in that code?
A) MFEDJJOE B) EOJDEJFM
C) EOJDJEFM D) EOJDEJFM
Answer: EOJDEJFM

37.Which Hetvabhasa arises when the reason (Hetu) contradicts perception?
A) Satpratipaksha B) Badhita
C) Asiddha D) Savyabhichara
Answer: B

38.Which statement best expresses Arthapatti (Postulation)?
A) Inferring unseen from seen.
B) Assuming a fact to explain another fact.
C) Knowing something through verbal testimony.
D) Direct sense perception.
Answer: B

39.Which Pramana refers to knowledge derived from comparison in Indian epistemology?
A) Arthapatti B) Upamana C) Shabda D) Anumana
Answer: B

40.Which Pramana refers to knowledge derived from comparison in Indian epistemology?
A) Arthapatti B) Upamana C) Shabda D) Anumana
Answer: B



సాహిత్యం అనేది మానవ ఆత్మకు అత్యంత ఖచ్చితమైన ప్రతిబింబం. రచయిత సత్యం ప్రవక్త మాత్రమే కాకుండా జీవన నిర్మాణకర్తగా ఉండాలి. సాహిత్యం ఉద్దేశ్యం మనిషిని తనను తాను, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకునేలా చేయడమే!

– మాక్సిం గోర్కీ

మకాం

చూడకూడనిదేదో చూచినట్టు
ఉన్నట్టుండి
సముద్రానికేమైందో కానీ
గుండెల్ని బాదుకుంటూ
గాలి శోకాలు పెడుతూ
అర్ధరాత్రేళ ఊరి మీద పడింది!

ఏడాదిగా కళ్ళల్లో పెట్టుక్కాచిన
చేనూ చెలక నీటి ఉసురుకు బలై
కుళ్ళిన మృతకంపు కొడుతున్నాయి

నెలపురిటి పసికందు గెలల బాలింత అరటితోట
కుప్పకూలిన కురుక్షేత్రమైంది
తల్లకిందులైన చెట్లల్లే
రైతు కష్టం మరోసారి గంగ పాలైంది!

ఆహ్లాదాన్నే కాదు
హాలాహలాన్నీ చవిచూపే సముద్రం
ఆరుగాలాలు
కాయకష్టాన్ని నమ్ముకుని మోసపోయే
రైతు కళ్ళల్లోనే కదా
ఎల్లవేళలా మకామేసేది!

– మోకా రత్నరాజు, 99890 14767

కనీస పింఛను

ఊరట మాటలు ఎక్కువయి
మూటల ఊటలు లేక
జీవితం బీటలు తీసినప్పుడు
'వెయ్యి' ముద్రతో జరాయువు

వృద్ధాశ్రమంలో ఎండ మావుల్ని లెక్కిస్తాడు!
చెయ్యని పాపానికి
శిలువ వేయబడ్డ వయసు
తమస్సులో మునిగిపోతుంది
'వెయ్యి'నే పది సార్లు లెక్కపెడతాడు
పదివేలని భ్రాంతి చెందుతాడు!

'విజను', 'రివిజను', 'కమిషన్'
ఏవో నీరు లేని మేఘాలై ఆశలు చూపుతుంటాయి!
'వెయ్యికి' ఏవో జోడించాలి
'జీవో' మాత్రం ప్రవేశించదు!
ఇన్నాళ్ళ చాకిరీ తర్వాత
చెరకు పిప్పికి ఏం మిగులుతుంది?

గద్దె నెక్కిన వాళ్ళు
సొంత లాభం కొంత చూసుకున్న తర్వాతే
వాలిపోతున్న పొద్దుని పలకరిస్తాకు!
'వెయ్యి' జీవులని
వైతరణి తీరానికి సాగనంపాక
వికసిత భారతం
శ్రావ్యంగా మైకుల్లో వినబడుతుంది!
అచ్చే దిన్ చప్పట్లతో
హస్తిన దద్దరిల్లిపోతుంది!

– వీరేశ్వరరావు మూల

తుపాను

అల్పమైన జీవితాలపై అల్ప పీడనాలు
దినదిన గండాల వాయుగుండాలు
తుపాను విలయపు వలపు గీతాలు
భారీ వర్షాల బృందగానాలు

కొరకొర చూస్తున్న కరి మబ్బుల కొరివి దయ్యాలు
దిగంతాల పందిరిని అల్లుకున్న మెరుపు తీగలు
ఉవ్వెత్తున ఎగసిపడే ఉత్తుంగ తరంగాలు
తెరపి లేని వానలు తెర చాపల నావలు

కదనరంగ విలయ బ్రహ్మాస్త్రం
సాగర గర్భ జనిత వరుణాస్త్రం
తీరాన్ని చేరాలనే తీవ్ర ఆరాటం
దారితెన్నూ లేని బతుకు పోరాటం

భూమాత ఒంట పై బురద గాయాలు
పచ్చని పంటల నిర్వేద రాగాలు
వలపన్నిన వరద ప్రవాహాలు
చితికిన అతుకుల బతుకులు
చిగురుటాకులా వణికింది జగత్తు
తుపానుకు జత కలిసింది మరుత్తు
వర్షధారలు ఒకవైపు అశ్రుధారలు మరొకవైపు

మనుషుల పెడ రెక్కలు విరిచిన తుపాను మొంథా
ప్రకృతి వాతల నుంచి అన్నదాతలను ఆదుకోవటం
కావాలిప్పుడు పాలకుల ప్రప్రథమ పంథా!

– అయినంపూడి వెంకట నారాయణ
79814 22372

ఆకాశమంత హృదయం

చీత్కారపు వాకిట్లో నిన్ను నిలబెట్టి
అవమానపు మసిని పూసినా
విసుగెరుగని మనసు
అలుపులేని ఆలోచనలతో
ఎన్నో జీవితాలలో వెలుగులు నింపావు

శరీరానికి అహంకారంతో ఎన్ని
గాయాలు చేసినా
సహనమనే లేపనం పూసుకుంటూ
ఉబికివచ్చే కన్నీళ్ళ అంచున
చిరునవ్వును కుర్చోబెట్టి
పయనం సాగిస్తున్నావు .
కదిలే కాలంలో
కష్టాలనదిని దాటుతూనే
ముందడుగులేస్తున్నావు

బాధలు నీ చుట్టూ మేఘాలై కమ్మేసినా
చినుకులా రాలి
రాయిలాంటి మనసులను సైతం
కరుణతో తడిపేస్తావు
నీ హృదయం ఆకాశమంతని
ప్రతి క్షణం నిరూపించుకుంటున్నావు .

– చింతా రాంబాబు, 99481 78092

ఉమ్మడిశెట్టి అవార్డు-2025 కోసం విజ్ఞప్తి


38వ ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు – 2025 పరిశీలన కోసం కవులు తమ కవితా సంపుటాలు పంపుకోవలసినదిగా అవార్డు వ్యవస్థాపకులు డా.రాధేయ ఒక ప్రకటనలో కోరారు. అవార్డు పరిశీలన కోసం 2025లో ప్రచురితమైన కవితా సంపుటాలను మాత్రమే పంపాలి. ఎంపికైన ఉత్తమ కవితా సంపుటికి రూ.6 వేలు నగదు, షీల్డ్‌తో కవికి సన్మానం ఉంటుంది. 10- 01- 2026 తేదీలోగా నాలుగు ప్రతులు ఈ చిరునామాకు పంపాలని తెలిపారు.

6న ప్రకాశ కిరణాలు ఆవిష్కరణ

సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు రచించిన 'ప్రకాశకిరణాలు' సంపాదకీయాల సంపుటి నవంబర్ 6, 2025న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ కళాసుబ్బారావు కళావేదికపై డా. కె.వి.రమణాచారి ఆవిష్కరించనున్నారు. డా. పి.విజయబాబు సభకు అధ్యక్షత వహిస్తారు. ఈ సభలో కళా వి.ఎస్.జనార్దనమూర్తి, డా. వంశీ రామరాజు, బైస దేవదాసు, మౌనశ్రీ మల్లిక్, పెద్దూరి వెంకటదాసు, పొత్తూరి జయలక్ష్మి పాల్గొంటారు. ఈ పుస్తకాన్ని కవి,రచయిత వి.యస్.వి.ప్రసాద్‌కి అంకితం కావిస్తారు.

– వి.వి.రాఘవరెడ్డి
జి.వి.ఆర్.ఆరాధన కల్చరల్ ఫౌండేషన్

'స్వీయచరిత్ర' సంక్షిప్తీకరణ- 'స్వీయ' అనుభవాలు



ప్రగతిశీల సాహిత్యాన్ని ప్రచురించి ఆసక్తి గల పాఠకులకు ఉచితంగా అందజేసే కార్యక్రమాన్ని డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ (రామచంద్రపురం) 2004లో ప్రారంభించింది. ఈ ఏడాది 21వ ప్రచురణగా కందుకూరి వీరేశలింగం గారి 'స్వీయ చరిత్ర'ను సామాన్య పాఠకుల కోసం సరళీకరించి, సంక్షిప్తీకరించే బాధ్యతను కమిటీ నాకు అప్పగించింది. ఈ పుస్తకాన్ని ప్రజాశక్తి బుక్ హౌస్ ఎడిటర్ ఎవిఎస్ శర్మ అక్టోబర్ 19వ తేదీన రామచంద్రపురంలో ఆవిష్కరించారు. మూలంలో 800 పేజీలున్న ఈ పుస్తకాన్ని ప్రధాన భావం చెడకుండా సరళీకరించి, సంక్షిప్తీకరించి 172 పేజీలకు కుదించడంలో ఎదురైన నా అనుభవాలను చెప్పడమే ఈ వ్యాసం ఉద్దేశం.

వీరేశలింగం గారి 'స్వీయ చరిత్ర' చదవడం సామాన్య పాఠకులకు కష్టంగా ఉండటానికి రెండు కారణాలున్నాయి. మొదటిది అందులో కేవలం ఆయన వ్యక్తిగత జీవితాన్నే కాకుండా ఆ కాలంలో తన ప్రమేయం ఉన్న ప్రతి సామాజిక అంశాన్నీ గ్రంథస్థం చేసారు. దాని విస్తృతి బాగా పెరిగింది. అందుకే ఆయన 'స్వీయ చరిత్ర'ను నాటి సాంఘిక చరిత్ర అని కూడా చెప్పవచ్చు. రెండోది ఆయన వాడిన భాష, ఆ శైలి నారికేళపాకం. (ఏ ప్రయత్నమూ లేకుండా సునాయాసంగా అర్థమైన శైలిని ద్రాక్షాపాకం అని, కొంచెం ప్రయత్నం చేస్తేనే అర్థమైనదాన్ని కదళీ పాకం అనీ, ఎక్కువ ప్రయత్నంతో కానీ అర్థం కాని శైలిని నారికేళపాకం అని ఆలంకారికులు అంటారు.) ఈనాడు వాడుకలో లేని పదజాలంతో గ్రాంథిక భాషలో సాగుతుంది. పేరాల విభజన ఎక్కడో కానీ కన్పించదు. వీరేశలింగం గారు స్వీయ చరిత్ర రాసే కాలానికి ఒక నమూనా లేదు. 'నేనారంభించిన కాలములో తెలుగులో ఏవిధమైన పుస్తకములు వచన రూపమున లేవనియే చెప్పవచ్చును. అన్నియు నూతన సృష్టి చేయవలెను' అని ఆయనే చెప్పుకున్నారు. సంక్షిప్తీకరణలో నేను వీరేశలింగం గారి మూలగ్రంథంలోని ఏయే అంశాలు తొలగించాను? ఆయన వాడిన పదజాలానికి అర్థాలను కనుక్కోవడంలో ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నాను? ఆధారంగా తీసుకున్న ఇటీవలి పునర్ముద్రణ ప్రతిలో ముద్రారాక్షసాల వల్ల అర్థాలు ఎలా మారిపోతున్నాయి? అనేవి చెప్పదలచుకున్నాను.

ముందుగా ఇది ఎనిమిది వందల పేజీలు కావడం వెనుక మూడు అంశాలు ఉన్నాయి. మొదటిది వీరేశలింగం గారి రచనలు మొత్తం 113. ఆయన 'నేను ఫలానా పుస్తకం రాశాను' అని చెప్పి ఊరుకోకుండా వాటిలోంచి ఐదేసి, పదేసి పద్యాలను ఉదాహరించారు. ఆయన కవిత్వాన్ని మెచ్చుకున్న ప్రసిద్ధ పండితులు కూడా తమ ప్రశంసలను పద్యాల్లోనే రాశారు. నిఘంటువులు పరిశీలించకపోతే ఇవి అర్థం కావు. వీటితోబాటు ఆయన శిథిలావస్థలో ఉన్న కావ్యాలకు శుద్ధప్రతులను తయారు చేశారు. ఒకే కావ్యానికి సంబంధించి వివిధ కాలాల్లో వెలువడిన ప్రతులను తెప్పించి, తప్పొప్పులను సరిదిద్ది, 13 కావ్యాలను ప్రచురించారు. వాటికోసం తాను పడిన శ్రమనూ వాటిలోని తన శైలినీ కూడా పరిచయం చేశారు. ఉదాహరణకు కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలము'ను తెలుగు చేయడానికి బొంబాయి, కలకత్తా, మద్రాసు పట్టణాల నుంచి ప్రతులను తెప్పించి, వాటిని పరిశీలించి, తరువాత అనువదించారు. ఆ వివరాలన్నీ చెప్పడమే కాక, తన అనువాదశైలిని పరిచయం చేయడానికి అందులోని పద్యాలను ఉదాహరించారు.

రెండోది : సంస్కరణోద్యమంలో ఎదురైన సమస్యలను చాలా కూలంకషంగా చెప్పారు. ఉదాహరణకు స్త్రీ విద్యపై వాదోపవాదాలూ, వితంతు వివాహాలపై చర్చలూ, వివాహాల నిమిత్తం పెట్టిన ఖర్చుల వివరాలూ 20, 30 పేజీల వరకూ ఉన్నాయి. రాజమహేంద్రవరంలో టౌన్‌హాల్ నిర్మాణం కోసం చేసిన దరఖాస్తులో ట్రస్టీల పేర్లు, ఒకవేళ ఆ ట్రస్టీ సభ్యులలో ఎవరైనా మరణిస్తే వారి స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలి? టౌన్ హాలుకున్న సరిహద్దులు ఏంటి? కలప ఎక్కడకొన్నారు? ఎలా కొన్నారు? అనే విషయాలను 18 పేజీల్లో రాశారు. కోర్టు కేసులకు సంబంధించి ఆయన ఎదుర్కొన్న ఆరోపణలు పేజీలకు పేజీలు సాగుతాయి. ఉదాహరణకు ఒక మహిళ తన ఇంటిమీద గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి రాళ్లు వేస్తున్నారని, తన గోడ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయనకి మొర పెట్టుకుంది. వీరేశలింగం గారు ఆ సమస్యను కోర్టుముందు పెట్టారు. ఆ కేసు గురించి వివరణ 35 పేజీలు రాశారు. లార్డ్ రిప్పన్ మద్రాసు వచ్చినప్పుడు ఆడపిల్లలు పాడటానికి ఆయన రాసిన పాటలూ పద్యాలూ ఏడు పేజీలు. వితంతు శరణాలయం నిబంధనలు, హితకారిణి సంస్థ విరాళాల కోసం రాసిన విజ్ఞప్తులు 20, 30 పేజీల దాకా ఉన్నాయి. వ్యాకరణ చర్చలో ర– అ ల మధ్య తేడాల చర్చ వంటివి 3 పేజీల్లో ఉన్నాయి.

మూడో అంశం లేఖలు. ఆయన సంస్కరణోద్యమ కార్యకలాపాలకు వెన్నుదన్నుగా ఉన్న పైండా రామకృష్ణయ్య (కాకినాడ) వంటి ప్రముఖులు రాసిన లేఖలనూ, వితంతు వివాహాలను సమర్థిస్తూ ఆంధ్రేతర ప్రాంతాల నుంచి వచ్చిన లేఖలనూ యథాతథంగా ఇచ్చారు. ఆ లేఖలు చాలా వరకూ ఇంగ్లీష్‌లో ఉన్నాయి. వాటికి అనువాదాలు కూడా ఇచ్చారు. ఆయన అనవసరం అనుకున్నప్పుడు "వారు చెప్పిన దానిలో నా స్తోత్ర పాఠాలు తప్ప విశేషాంశాలు ఏమీ లేవు' అని వాటిని వదిలేశారు. తన పత్రికలో లంచగొండులను విమర్శిస్తూ రాసిన వ్యాసాల్లో ఆ విషయంపై తాను రాసిన ప్రహసనాలను పేజీల కొద్దీ ఉటంకించారు. అన్నం కంటే ఆదరువు (ఆదరువు నంజుకునే పచ్చడి) ఎక్కువైనట్టు వీరేశలింగం గారి జీవిత విశేషాలకంటే వీటి ప్రస్తావన ఎక్కువైందని ఇలాంటివన్నీ విడిచి పెట్టాను.

భాష : ఆయన స్వీయ చరిత్ర మొదటి భాగం 1911లో, రెండో భాగాన్ని 1915లో ప్రచురించారు. ఆ నాటికి వచన రచనలు లేవు కాబట్టి కావ్యభాషే ఉపయోగించారు. రెండు భాగాల మధ్యా వ్యవధి ఉండటం వల్ల మొదటి భాగానికీ, రెండో భాగానికీ పదజాలంలో కొంత మార్పు వచ్చింది. ఆంధ్రేతర పదాలను వీలైనంత వరకూ వాడకూడదనుకున్నారేమో! ఉర్దూ పదాలను దూరం పెట్టారు. 'బయానా'ను 'సంచకరువు' అన్నారు. 'రసీదు'ను 'దానిక' అన్నారు. (రసీద్.. ఉర్దూ. దాన్నుంచే రసీదు వచ్చింది) 'చొక్కాజేబు'ను 'కంచుక కోశము' అన్నారు. ఎందుకంటే 'చొక్కా', 'జేబు' తెలుగు కాదు.

'చొక్కా అనునది తెనుగు పదము కాదు. తెలుగు వేషముతో చొరబడిన అరబ్బీ పదము' అన్నారు సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'లో. 'జేబు' ఉర్దూలోని 'జేబ్' నుంచి వచ్చింది. 'కర్చు'తో బాటు 'ఖర్చు' కూడా ఆయన వాడారు. మనం 'కర్చు' తప్పు అనుకుని 'ఖర్చు (ఖర్చ్) ఉర్దూ అనే మాటను మాత్రమే వాడుతున్నాం. హిందీలోని 'రేల్' నుంచి రైలు వచ్చింది. అందుకే ఆయన రైలు మార్గాన్ని 'అయోమార్గం' అన్నారు. 'అయము' అంటే ఇనుము. పెన్సిల్ ఇంగ్లీష్ కాబట్టి దాన్ని 'సీసపు పుడక' అన్నారు. గుళికాపాతము అంటే గుళిక (ఉండ) వేయడం అని తెలుసు కానీ ఈ మాటకు సీక్రెట్ ఓటింగ్ అని అర్థం ఉందని తెలుసుకోవడానికి నాకు చాలా సమయం పట్టింది. సిపి బ్రౌన్ ballot పదం దగ్గర 'ఉండలు వేయడము. అనగా ఒకణ్ణి ఒక సభలో ప్రవేశపెట్టడానికి సభలో ఉండే దొరలు ప్రతి మనిషిన్నీ ఒక పెట్టెలో తెల్ల ఉండనైనా, నల్ల ఉండనైనా వేస్తారు. తెల్ల ఉండలు నిండా ఉంటే అతన్ని ప్రవేశపెడతారు. నల్ల ఉండలు అధికంగా ఉంటే అతన్ని ప్రవేశపెట్టరు. దీనికి ballot అని పేరు' అన్నాడు. వీరేశలింగం గారు 400 అనడానికి 'నన్నూరు' అనే మాట వాడారు. నన్ అంటే నాలుగు అని అర్థం. వంటవాణ్ణి 'పాచకుడు' అన్నారు. 'పచనము' అంటే వంట వండటం. 'తనకే నూరు రూపాయల నిచ్చెదనని సందేశం పంపారు' అనే వాక్యం మామూలుగా చదివితే తన ఒక్కడికే నూరు రూపాయలు ఇస్తారనే అర్థం వస్తుంది. కానీ ఇక్కడ ఒక్కడికే ఏనూరు అని విడదీసుకుని చదవాలి (దీనికి వ్యాకరణం వర్తించదు). ఏనూరు అంటే 500 అని అర్థం. అంటే తనకు, ఏను, నూరు అని విడదీసుకోవాలి. ఏను అంటే 5 అని అర్థం. మనకు 'పది హేను'లో ఈ ఏను ఉంది. నలభై మంది అనడానికి 'నలువండ్రు' అన్నారు. భార్య చనిపోయిన పురుషుణ్ణి 'విధురుడు' అన్నారు. ('విదురుడు' భారతంలో పాత్ర). 'కఠినశైలి'ని 'పెటుకు శైలి' అన్నారు. పెటుకు అంటే 'కఠినమైన' అని అర్థం. 'బూడిద పాలు' అనడానికి 'పదట కలుపుట' అన్నారు. 'పదట' అంటే 'ధూళి' అని అర్థం. జామీనుగా ఉండటం అనే అర్థంలో 'పూటబడుట' అన్నారు. 'పూట' అనే మాటకు సెక్యూరిటీ, షూరిటీ, బెయిల్ అనే అర్థాలు ఇచ్చాడు బ్రౌన్. రక్త విరోచనాల వ్యాధిని 'రక్త గ్రహణి' అన్నారు. 'గ్రహణి' అతిసార వ్యాధి. రూపాయలను 'రౌప్యములు' అన్నారు. ఈ మాటకు వెండితో చేసినది అని అర్థం. పూర్వం రూపాయలను వెండితో చేసేవారు. ఆచ్ఛాదన పత్రము అన్నారు envelop letter". ఆచ్ఛాదనము అంటే కప్పి ఉంచేది, మూసి ఉంచేది అని అర్థం. పూర్వం బిలియర్డ్స్ టేబుల్‌పై దంతంతో చేసిన బంతులను ఉపయోగించేవారు. అందుకే బిలియర్డ్స్ టేబుల్‌ని 'దంత గోళ క్రీడాఫలకము' అన్నారు.

నేను ఆయన వాడిన పదాల స్థానంలో పాఠకులకు అర్థం అయ్యే పదాలను రాస్తే సరిపోతుంది. కానీ, దానివల్ల వీరేశలింగం గారు ఏయే పదాలను వాడారో పాఠకులకు తెలిసే అవకాశం లేదు. కాబట్టి అందరికీ అర్థమయ్యే పదాలనే రాసి వాటికి వీరేశలింగం గారు వాడిన మాటలను బ్రాకెట్లో ఇచ్చాను. అయితే నా ఉద్దేశంలో కొన్ని పదాలు అర్థం కాకపోయినా నష్టం లేదు. 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధం' వంటివి వదిలేశాను. ఒకవేళ దాన్ని ఫుట్ నోట్లో వివరించాలన్నా ఒక పెద్ద పేరా రాయాలి.

పునర్ముద్రణల్లో అచ్చుతప్పులు

వీరేశలింగంగారి కాలానికి చెందిన 1911, 1915 నాటి స్వీయచరిత్ర ముద్రిత ప్రతులు దొరకవు. Pdf లే ఆధారం. కాబట్టి చదవడానికి సౌలభ్యంగా ఉంటుందని ఇటీవల అచ్చయిన పుస్తకాలు చూసి, సందేహాలు వచ్చినపుడు మూల రచన పరిశీలించాలనుకున్నాను. మే 2015లో రాజమహేంద్రవరం లోని 'ఆంధ్రకేసరి యువజన సమితి' స్వీయచరిత్ర'ను ప్రచురించి ప్రశంసనీయమైన పని చేశారు. కానీ ప్రెస్ వాళ్ళ అజాగ్రత్త వల్ల అందులో ముద్రా రాక్షసాలు ఎక్కువగా కనిపించాయి. ఉదాహరణకు కొన్ని వివరిస్తాను.

వీరేశలింగం గారు తాను నిర్మించిన టౌనుహాలుని ఉపయోగించడానికి కొన్ని నిబంధనలు విధించారు. ఆ సందర్భంలోని వాక్యం 'అవయవాదులతో సంబంధించిన యుత్సవములు, భజనలు, విగ్రహ పూజలు.... ఇందు (ఈ టౌను హాలులో) జరపగూడదు (పేజీ 330)' అని ఉంది. ఈ వాక్యంలో ఎక్కడో లోపం ఉన్నట్టు కనిపించి 1911 నాటి pdf చూశాను. అందులో 'అవయవాదులతో' అని కాక 'అవతారాదులతో సంబంధించిన ఉత్సవములు, భజనలు, విగ్రహ పూజలు ఇందు ... జరపగూడదు' అని ఉంది. అంటే వీరేశలింగం గారు అప్పటికే ఏకేశ్వరోపాసకులయ్యారు. దాని ప్రకారం అక్కడ దశావతారాలకు సంబంధించిన ఉత్సవాల వంటివి జరపకూడదని ఆయన ఉద్దేశం.

అలాగే వీరేశలింగం గారికి బ్రిటిష్ ప్రభుత్వం 1893లో 'రావు బహదూర్' బిరుదునిచ్చింది. ఆ సందర్భంలో 'డంకన్ దొర గారు రాజమహేంద్రవరం వచ్చినప్పుడు కళాశాల భవనంలో ఒక సభ చేసి ఉపాధ్యాయుల, విద్యార్థుల సమక్షంలో దొరతనం వారంపిన నగదును నాకు బహిరంగముగా దయచేసిరి' అనే వాక్యం ఉంది (పే.382). కానీ బ్రిటిష్ వాళ్ళు బిరుదుతో పాటు సర్టిఫికెట్ మాత్రమే ఇచ్చారు. నగదు ఇవ్వలేదు. మూలప్రతి చూశాను "...దొరతనము వారంపిన 'సనదు'ను బహిరంగముగా నాకు దయచేసిరి" అని ఉంది. 'సనదు' అంటే సర్టిఫికెట్, యోగ్యతా పత్రం అని బ్రౌన్ నిఘంటువులో ఉంది. ప్రెస్ వారు 'సనదు'ని 'నగదు'గా భ్రమపడ్డారు. మరొకటి. వీరేశలింగం గారు బాల్యంలో చీట్ల పేక ఆడే మిత్రునితో స్నేహం చేసి ఆ తర్వాత తప్పు తెలుసుకుని ఆ స్నేహాన్ని విడిచిపెట్టారు. ఇక్కడ "ఆ మిత్రునితోడి సాంగత్యమావశ్యకమని ఫలితార్థము తేలుచున్నది" (పే.56) అని ఉంది. ఒక స్నేహం మంచిది కాదని తెలిసిన తర్వాత అది ఆవశ్యకము అని ఎలా చెబుతారు? 1911 నాటి ప్రతి చూశాను. అందులో "ఆ మిత్రుని తోడి సాంగత్యమును విడిచిపెట్టితిని. పై దాని వలన సత్ప్రవర్తనమునకు సజ్జన సాంగత్యము ఆవశ్యకమని ఫలితార్థము తేలుచున్నది" అని ఉంది. దీన్ని సంక్షిప్తంగా చెప్పాలనుకోవడం వల్ల జరిగిన పొరపాటు ఇది. 'స్త్రీల కొరకు మా మేడ మీద ప్రత్యేకంగా 'జనానాంతరగతులను' పెట్టి వారికి నేనే చదువు మొదలైనవి చెప్పుచుంటిని' అని ఉంది. 'జనానాంతరగతులను' అంటే అర్థం కాలేదు. మూలంలో 'జనానా తరగతులు' అని ఉంది. జనానా అంటే Apartments appropriated to women అన్నాడు బ్రౌన్. ఒత్తులూ, దీర్ఘాలూ, అక్షర దోషాలూ వంటి ముద్రా రాక్షసాలను నేను పట్టించుకోలేదు. కానీ ఆ లోపాల వల్ల కొన్ని పదాల అర్థాలు మారిపోతున్నాయి. కొన్నింటికి అసలు అర్థమే తెలియడం లేదు. అలాంటి పదాలనూ, అసంపూర్తిగా అచ్చయిన వాక్యాలనూ మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. మూల గ్రంథంలోని పదాలను చూపించి అవి ఈ పుస్తకంలో ఎలా తప్పుగా అచ్చయ్యాయో పేజీ నంబర్లతో సహా బ్రాకెట్లలో ఇస్తున్నాను.

'రోత మాటలు' 'రోట మాటలు' (పే 32)గా, 'స్వకృత్య నిర్వహణము' 'స్వకత్య నిర్వహణము' (పే.332)గా, 'అనిన మాటలను' 'అనని మాటలు' (పే 343)గా, 'అతృప్తికరమైనది' 'సంతృప్తికరమైనది' (పే.355)గా మారిపోయాయి. 'ఇతరవిషయమును ముట్టుట' 'ఇతర విషయమును ముట్టక' (పే 355) అయింది. 'అయుక్త సంబంధము' 'యుక్త సంబంధము' (పే.361) అయిపోయింది. 'పద్యగద్యములను' 'పది గద్యములను' (పే 432)గా మారిపోయింది. 'పట్టి పొగడ్తలు' కాస్తా 'నట్టిపొగడ్తలు' (పే 442) అయ్యాయి. 'వచనములను విడుచుటకు' 'వచనములను విరుచుటకు' (పే.443) అయింది. 'గ్రామ్యము' 'గ్రాహ్యము' (పే.448) అయిపోయింది. 'చెప్పుచున్నను' 'చెప్పుచున్నాను' (పే.448) అయింది. 'చేకొని (తీసుకొని) చూచు' 'చేసికొని చూచు' (పే.461)గా మారింది. విగ్రహ తంత్రంలోని ఒక కథలో 'కాకి యుక్కునమెక్క సాగెను' అనే వాక్యంలోని ఉక్కున (వేగంగా) అనేది 'అక్కున' (పే. 463)గా మారింది. 'విద్యాభివర్ధని పత్రిక' 'విద్యాభివృద్ధని పత్రిక' (పే.465) అయ్యింది. 'శక్తియు' 'భక్తియు' (పే.500)గా మారింది. 'తమనీతులు' 'దమన నీతులు (పే.540) అయ్యాయి. 'అసమాన బలము' 'అవమాన బలము' (పే 548) అయింది. 'మత విషయకములయిన' 'తమవిషయకములయిన' (పే 548) అని మారింది. 'హిందూ దేశము' 'హిందూదేహము' (పే.557) అయింది. 'వివర్జించు' 'విసర్జించు' (పే 558)గా మారింది. 'తత్కార్య నిర్వహణ 'ఉత్కార్య నిర్వహణ' (పే.578) అయిపోయింది. కొన్ని చోట్ల వాక్యాలకు వాక్యాలే ఎగిరిపోయాయి. ఈ చర్చ అంతా భవిష్యత్తులో ఇలాంటి అపురూప పుస్తకాలను ప్రచురించేవారు ప్రూఫ్ రీడింగ్ విషయంలో తగిన శ్రద్ధ తీసుకోమని సూచించడానికే గానీ ఈ పుస్తక ప్రచురణకర్తల అపూర్వ ప్రయత్నాన్ని తక్కువ చేసి చూపడానికో, వారిని కించపరచడానికో కాదని మనవి.

– పి.యస్.ప్రకాశరావు

అతివల అంతరంగ ఆవిష్కరణ



వర్ధమాన రచయిత సృజన వావిలిపల్లి ఇటీవల వెలువరించిన నవల 'ఆనందమాయే సఖి'. ఇది ముగ్గురు యువతుల కథ. భిన్న కుటుంబ నేపథ్యాల నుంచి వచ్చిన అమ్మాయిల కథ. తమ ఆసక్తులకు, అభిరుచులకు తగ్గ వ్యాపకాల అన్వేషణలో అనుకోకుండా కలిసిన ముగ్గురు నేస్తురాళ్ల కథ. ప్రతిభ వున్నప్పటికీ ప్రోత్సాహం కరువైన వ్యవస్థలో ఆటంకాలను ఎదిరించే క్రమంలో అనేక అవస్థలకు గురై చివరికి గెలిచి చూపించడానికి ధిక్కార స్వరాలను వినిపించిన సబలల కథ.

కథలోకి వెళితే– మైథిలికి ఫోటోగ్రఫీ అంటే ఇష్టం. నేత్రకి ఆర్టిస్టు అవ్వాలని కల. అనన్య బాగా పాటలు పాడుతుంది. ఈ ముగ్గురు అమ్మాయిల కాలేజీ లైఫ్ నుంచి మొదలుపెట్టి జీవితాల్లో తమకు నచ్చిన విధంగా స్థిరపడే వరకూ కొనసాగే కథ ఇది. మైథిలి, నేత్ర ఒకే ఇంట్లో రూమ్‌మేట్స్‌గా కొన్ని ఏళ్ల నుంచి వుంటారు. గతంలో దూరమైన స్నేహితురాలు అనన్య సడన్‌గా కలుస్తానని కాల్ చెయ్యడంతో కథ మొదలవుతుంది. అసలు ఇన్నాళ్లూ తాను ఎక్కడుందో, ఎందుకు కలవలేదో, ఇప్పుడెందుకు కలుస్తానని అంటుందో అన్న ఆలోచనలో పడతారు నేత్ర, మైథిలి. తన పెళ్ళి కారణంగా దూరమైన ఆ అమ్మాయి... ఆ బంధంలో ఆనందంగా లేదని తెలుసుకొని మైథిలి, నేత్ర బాధ పడతారు. తన మనసుని తేలిక పరిచే పనులు కొన్ని చేస్తారు. అలాంటి సమయంలో అనన్యకి ఒక సంఘటన వల్ల గతం గుర్తొచ్చి తీవ్ర సంఘర్షణకు గురవుతుంది. మైథిలి, నేత్ర తనతోనే వుండి ధైర్యం చెప్తారు. ఆ తర్వాత కథ గతంలోకి వెళ్తుంది.

ఒకే బస్సులో అనుకోకుండా ప్రయాణించడం వల్ల, ఒక హాస్టల్లోనే చేరడం వల్ల ... ఈ ముగ్గురూ ఒకరికొకరు పరిచయం అవుతారు. తరువాత అది మంచి స్నేహంగా బలపడుతుంది. బాధల్లో ఒకరినొకరు ఓదార్చుకోవడం, ఆనందాన్ని కలిసి పంచుకోవడం, ఏదైనా సమస్య వస్తే ఒకరికొకరు తోడుగా నిలబడడం... ఇవన్నీ వాళ్ళని విడిపోలేనంత దగ్గర చేస్తాయి. వాళ్ళకి ఎదురైన శారీరక, మానసిక దాడి గురించి, పిరియడ్స్ గురించి, లైఫ్‌గోల్స్ గురించి, మొదటి ప్రేమ గురించి, ఫ్యూచర్ పార్ట్‌నర్ గురించి... ఒకటని కాదు; ఇలా అనేకం మాట్లాడుకుంటారు. కాలం ముందుకు వెళ్ళే కొద్దీ ముగ్గురి జీవితాల్లోకి ప్రేమ ముగ్గురు అబ్బాయిల రూపంలో వస్తుంది. అనుకోని పరిస్థితుల్లో నేత్ర తన ప్రేమకి దూరమవుతుంది. అనన్య కావాలనే దూరం పెడుతుంది. మైథిలి ఆ ప్రేమను తన జీవితంలోకి ఇష్టంగా ఆహ్వానిస్తుంది.

అనన్య ప్రేమ గురించి తెలిసిన వాళ్ళ అమ్మా నాన్న తనకి పెళ్ళి చెయ్యాలనుకుంటారు. దానికి అనన్య ఒప్పుకుంటుంది. నేత్ర, మైథిలి అది సరైన నిర్ణయం కాదని వాదిస్తారు. ఆ క్రమంలో మాటా మాటా పెరిగి ముగ్గురి మధ్య దూరం ఏర్పడుతుంది. 'నేనే కలవాలి అనుకున్నంత వరకు మీరు నన్ను కలవొద్దని' చెప్పి అనన్య వెళ్ళిపోతుంది. తరువాతి కాలంలో మైథిలి కెమేరా ఉమెన్‌గా, నేత్ర ఆర్టిస్టుగా స్థిరపడతారు. అనన్య స్కూల్ టీచర్ అవుతుంది. అసలు అనన్య జీవితంలో ఏమైంది అన్నది నేత్ర, మైథిలికి పెద్ద ప్రశ్నగా మిగుల్తుంది. ఆమె చెప్పేవరకూ ఏం అడగకూడదని నిర్ణయించుకుంటారు. కథ ముందుకు వెళ్ళే కొద్దీ అనన్య జీవితం గురించి ఒక్కో విషయం వాళ్ళకి తెలుస్తూ వుంటుంది.

నవలలో ఈ కథకు సమాంతరంగా మరో కథ నడుస్తుంటుంది. అది దిగువ మధ్య తరగతికి చెందిన ఝాన్సీ కథ. ఆమె తాగుబోతు భర్త హింసకి, అరాచకానికి బలవుతూ ఉంటుంది. ఒకసారి భర్త హింస మితి మీరినప్పుడు ఆమె తిరగబడుతుంది. అతనిపై కేసు పెట్టి, శిక్ష పడేలా చేస్తుంది. పగ పెంచుకున్న అతను ఆమెపై ప్రతి దాడి చెయ్యడానికి సిద్ధమవుతాడు. ఆ పెనుగులాటలో.. ఝాన్సీ చేతిలో హతమవుతాడు. ఝాన్సీ హత్యకేసులో ఇరుక్కుంటుంది. ఆమెను బైటకు తీసుకొచ్చే బాధ్యత ఈ ముగ్గురు స్నేహితురాళ్లు తీసుకుంటారు. ఆ పరిస్థితిలో ఎదురైన సంఘటనలన్నీ అనన్య గతానుభవాలను గుర్తు చేస్తూ వుంటాయి.

ఝాన్సీని ఎలాగో కష్టపడి బయటకి తీసుకొచ్చినా, ఆమె పట్ల సమాజం చూపుని, మాటల్ని వాళ్ళు మార్చలేకపోతారు. ఆ సమయంలోనే అనన్య తన గతంలో ఏం జరిగిందో చెప్పుకొస్తుంది. మన కథలు ఈ ప్రపంచానికి చెప్పేవాళ్ళు వుంటే బావున్ను అంటుంది. అప్పుడు మైథిలికి డాక్యుమెంటరీ తియ్యాలి అనే ఆలోచన వస్తుంది. ఆ ప్రయత్నంలో వాళ్ళు తెలుసుకున్నదేంటి? ఆ డాక్యుమెంటరీ వాళ్ళని ఎక్కడివరకూ తీసుకొని వెళ్ళింది? వాళ్ళ దృష్టిలో గెలుపంటే ఏమిటి? ఇవన్నీ కథా గమనంలో మనకి అర్థమవుతాయి.

ఈ నవల ఆలోచనలను రగిలించి, మనో వికాసానికి మార్గ నిర్దేశనం చేస్తుంది. తరాల మధ్య పేరుకుపోయిన అంతరాలు, వాటి వల్ల నలిగిపోయే జీవితాలు పాఠకుల సానుభూతిని చూరగొంటాయి. పాత తరం భావాలు నేటితరం ఆశలకు ఆటంకం కాకుండా అనుసంధానపరిచే సంస్కారం కావాలని సుతిమెత్తగా చేసిన ఉద్బోధ ఆకట్టుకుంటుంది. ఒక వందేళ్ల కాలాన్ని కొలమానంగా తీసుకొని సమాజ గతిని పరిశీలించినట్లయితే.. అనేక మార్పులు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. కానీ, మహిళల పట్ల సమాజం ప్రదర్శిస్తున్న వివక్ష విషయంలో మాత్రం మార్పు కనిపించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వివక్ష రూపాలు మారాయి తప్పితే వాటి మూలాల్లో మాత్రం ఏ మార్పూ కనిపించదు. ఈ విషయాన్ని ఎత్తి చూపుతుంది ఈ నవల. అతివల ఇష్టాలని, కష్టాలని సమాజం అర్థం చేసుకోవలసిన ఆవశ్యకతను స్పష్టం చేస్తుంది. ఈ తరం అమ్మాయిలకి సానుభూతి కాదు; సహానుభూతి కావాలని నొక్కి చెబుతుంది. ఈ నవల పాఠకుల్ని ఊహా ప్రపంచంలో ఊరేగించదు. వాస్తవ జగత్తులోని అసమానతల వల్ల ఆవిరైపోతున్న ఆడపిల్లల ఆశలను, ఆకాంక్షలను చేతులడ్డం పెట్టి సంరక్షించాల్సిన సామాజిక బాధ్యతను గుర్తు చేస్తుంది.

ఆధునికతను అందిపుచ్చుకోవడం అనేది అవసరాలను తీర్చుకోవడం కోసం మాత్రమే కాదు; భావాలను ఆధునీకరించుకోవడం కూడా అని నిర్ధారిస్తుంది. పాతది నశించి కొత్తది ఆవిర్భవించడం ప్రకృతి ధర్మం. ఆ ధర్మాన్ని అనుసరించడం మనుషుల కర్తవ్యం కావాలని విశదపరుస్తుంది. వర్ధమాన రచయిత సృజన వావిలపల్లి తొలి నవల ఇది. తనకు ఇది తొలి ప్రయత్నమే అయినప్పటికీ తడబాటుకు తావివ్వని విధంగా కథనం, సన్నివేశాల కల్పన, సరళమైన సంభాషణ, బిగి సడలని శైలి తదితర అంశాలన్నీ పాఠకుల మనసును ఆకట్టుకునే విధంగా వున్నాయి. అయితే ఆఖరిలో అంతవరకు నిదానంగా సాగిన నవల నడక అమాంతంగా ముగింపుకు చేరుకున్నట్టుగా అనిపిస్తుంది. అంతమాత్రాన అదేమీ నవల నాణ్యతను దెబ్బ తీసిందని కాదు. కాకపోతే మరికాస్త బిగితో సాగి వుంటే బాగుండేదని అనిపిస్తుంది.

– వి.రాజగోపాల్
91330 84262

నువ్వు ఒక రాయి అయితే ...

ఇక నువ్వు ఒక రాయి అయితే
ఈ దారి వెంట రాముడు ఇక రాడు
వచ్చినా పాదాల ధూళి సోకి
నువ్వు అహల్యవై ఆకారం తీసుకోలేవు

అయితే గియితే
నువ్వు వడ్డెర చేతిలో
ముక్క చెక్కల కంకరగా మారి
రానున్న తరాల కోసం
బాటను నిర్మించబడతావు

లేదు కాదు కూడదంటే
నాలుగు మూలలు కత్తిరించబడి
నువ్వు చెమటతో కట్టు రాయివై
అనాదిగా కనిపించకుండా పునాదివై
ఇంటి ఇంటినీ నిలబెడతావు
లేక వాళ్ల దయలేక నిన్ను తొక్కుకుంటూ
పైకి ఎక్కిపోయే మెట్లుగా మారిపోతావు
అయినా నీవు అవ్వాలనుకుంటే
శిల్పి సుత్తె ఉలి దెబ్బలకు
నిశ్శబ్దంగా బొబ్బ పెడుతూ
ముక్క ముక్కలై పోయి
ఒక ఆకారం తీసుకొని
అమాయక ప్రజలచే
దేవతగా కొలువు తీరవచ్చును!

అయినా ఉలుకు పలుకూ లేకుండా
ఒకానొక రాయివలె బతుకుతానంటే
ఏ ఒక్కరికీ పెద్దగా అభ్యంతరం ఉండకపోవచ్చు
నీ రెక్కల కష్టం నీదే తప్ప
నువ్వెంత అరాటపడి బాట వెంట
కళ్ళు కాయలు కాసేలా వేచి చూసినా
రాముడూ దేవుడూ కదిలి రారు
అల్లా వచ్చి అందమైన తోటను ప్రసాదించలేడు
గొర్ల కాపరి ఏతెంచి తోడేళ్ల బారి నుంచి
గొర్రెలను కాపాడలేదు లేడు

ఒకవేళ వస్తే గిస్తే
నెనరు గల్ల మనిషి వస్తాడు
కానీ అతని పాద దుమ్ముతో
శవ ఆకారం తప్ప
నవజీవ రూప విమోచనం
పొందలేవు గాక పొందలేవు!

– జూకంటి జగన్నాథం

ఢిల్లీని కమ్మేసిన కాలుష్య మేఘాలు



ఢిల్లీలో దట్టమైన పొగ కమ్మేయడంతో నీళ్లు వెదజల్లుతున్న నగర పాలక సంస్థ సిబ్బంది

- గాలి నాణ్యత సూచీ

400 మార్కును దాటిన వైనం

న్యూఢిల్లీ : దేశ రాజధాని నగరం న్యూఢిల్లీని కాలుష్య మేఘాలు కమ్మేశాయి. దట్టమైన దుప్పటి కప్పుకున్నట్లు కనిపిస్తోంది. అనేక ప్రాంతాల్లో ఆదివారం 'తీవ్రమైన' వాయు కాలుష్య స్థాయిలను ఎదుర్కొన్నాయి. గాలి నాణ్యత సూచిక (ఎక్యుఐ) 400 మార్కును దాటింది. ఆనంద్ విహార్, చాందిని చౌక్, నెహ్రూ నగర్, ఆర్కే పురం, రోహిణితో సహా అనేక ప్రాంతాలు 400 కంటే ఎక్కువ ఎక్యుఐ నమోదు చేశాయి.

దట్టమైన పొగమంచు నగరాన్ని ఆవరించింది. అయితే కృత్రిమ వర్షాల కోసం తాము చేపట్టిన క్లౌడ్ సీడింగ్ (మేఘ మథనం) కారణంగా వాయు కాలుష్య తీవ్రత తగ్గిందని ఢిల్లీలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించింది. ఈ ప్రకటనపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రజల ప్రాణాలతో బిజెపి క్రూర పరిహాసమాడుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే పార్టీకి చెందిన నాయకులు, వాయినాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ సైతం ఢిల్లీలో వాయు కాలుష్య తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా ఈ సమస్యను ఎదుర్కొందామని, ఇందుకోసం తగిన కార్యాచరణ తక్షణమే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆమె కోరారు.

కాగా కాలుష్య కారణంగా ఢిల్లీలో శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరిగిందని వైద్యులు తెలిపారు. ప్రజలు క్రమం తప్పకుండా ఎయిర్-ప్యూరిఫైయర్లను వినియోగించాలని సూచించారు. శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నవారు రాబోయే కొన్ని వారాల పాటు ఢిల్లీని విడిచిపెట్టి వెళ్లాలని, తద్వారా నగరంలోని వాయు కాలుష్యం నుండి దూరంగా ఉండాలని పల్మోనాలజిస్ట్ గోపీ చంద్ ఖిల్నాని పేర్కొన్నారు.

తీరుమారని మోడీ

- వ్యక్తిగత విమర్శలకే పరిమితం
- ఏం చేసిందీ చెప్పలేని వైనం



పాట్నా : బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమరాంగణంలో ఎన్‌డిఎ తరపున ప్రచారం చేపడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిపక్షాల నేతలపై వ్యక్తిగత దూషణలు మినహా ప్రజలకు తమ ప్రభుత్వం ఏమీ చేసింది..ఏం చేయనుంది వంటి విషయాల జోలికి వెళ్లడం లేదు. ఆరా లో ఆదివారం నిర్వహించిన ప్రచారసభలోనే మోడీ ఇదే తీరు కొనసాగించారు. 'ఆపరేషన్ సిందూర్' షాక్ నుంచి పాకిస్థాన్, కాంగ్రెస్ ఇంకా కోలుకోవడం లేదని, నాడు అక్కడ బాంబులు పడుతుంటే ఇక్కడ కాంగ్రెస్ రాజకుటుంబం నిద్రలు లేని రాత్రులు గడిపిందని ఆయన వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్య అనంతరం ఢిల్లీలో సిక్కులను ఊచకోత కోశారని, దానికి కాంగ్రెస్ క్షమాపణ నేటికీ చెప్పడం లేదని మోడీ అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటరు అధికార్ యాత్ర'ను పరోక్షంగా ప్రస్తావిస్తూ 'చొరబాటుదారులను రక్షించేందుకే ఈ ర్యాలీ నిర్వహించారని మోడీ ఆరోపించారు. అలాగే ఆర్‌జెడి అనుకూలంగా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించేందుకు కాంగ్రెస్‌కు ఇష్టం లేదని, కానీ తేజస్వీయాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా అంగీకరించేందుకు కాంగ్రెస్ తలపై తుపాకీ ఎక్కుపెట్టి మరీ ఆర్‌జెడి ఆ అవకాశాన్ని దక్కించుకుందని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం ఆ పార్టీల నేతలు పరస్పరం పోట్లాడుకుంటారని వ్యాఖ్యానించారు. జాతీయ భద్రత, సైన్యానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్‌ను అమలు చేస్తోందన్నారు. జమ్మూకాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశామని, ఉగ్రవాదులను వారి గడ్డపైనే శిక్షించాలని ప్రతిజ్ఞ చేశామని ఇలా బీహార్‌తో నేరుగా సంబంధం లేని పాత అంశాలను పునరుద్ఘాటించడం మినహా నిర్దిష్టంగా బీహార్ ప్రజానీకానికి ఏం చేశారన్నదీ ప్రధాని మోడీ తన ప్రసంగంలో చోటు కల్పించకపోవడంతో సభకు హాజరైన ప్రజలు సైతం నిరాశకు గురయ్యారు.



బెంగుసరయిలో మత్స్యకారులతో రాహుల్ గాంధీ

మహాగట్బంధన్‌తో ప్రజానుకూల పాలన

- హామీలివ్వడం.. ముఖం చాటేయడం మోడీకి అలవాటు
- రాహుల్ గాంధీ

పాట్నా : బీహార్‌లో మహాగట్బంధన్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో రైతులు, కార్మికులు, దళితులు, బలహీన తరగతుల ప్రజానీకానికి అనుకూలమైన పాలన అందిస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారు. కాంగ్రెస్, మహాగట్బంధన్ అభ్యర్థుల తరపున ఆయన బీహార్‌లోని బెగుసరాయ్ తదితర ప్రాంతాల్లో ప్రచార ర్యాలీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల వేళ హామీలు గుప్పించడం, ఆ తర్వాత రాష్ట్రం వైపు కన్నెత్తి కూడా చూడకుండా ముఖం చాటేయ్యడం ప్రధాని మోడీకి అలవాటుగా మారిపోయిందని ఆయన విమర్శించారు. ఓట్ల కోసం, అధికారం కోసం మోడీ ఏం చేయడానికైనా వెనుకాడబోరని తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తోందని, దీని గురించి యువతరం ప్రశ్నలు లేవనెత్తకుండా..వారి దృష్టి మళ్లించడానికి రీల్స్ చూడాలంటూ కోరుతున్నారని రాహుల్ ఆక్షేపించారు. తమ ఫ్రంట్ అధికారంలోకి వస్తే ప్రజలకు ఉత్తమ విద్య, ఉద్యోగ అవకాశాలు అందిస్తామని హామీ ఇచ్చారు.



భారత్-పాక్ సైనిక ఘర్షణను ఆపానని ట్రంప్ పదేపదే చెబుతున్నప్పటికీ.. ఆయనను నిలదీసి ప్రశ్నించే ధైర్యం మోడీకి లేకపోయిందని రాహుల్ విమర్శించారు. నోట్ల రద్దు, జిఎస్‌టి సంస్కరణలు వంటి మోడీ సర్కార్ తీసుకున్న నిర్ణయాలన్నీ దేశంలోని కొందరు వ్యాపారవేత్తలకే ప్రయోజనం చేకూర్చాయే తప్ప సామాన్య ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కానీ తాము మాత్రం చిరు వ్యాపారులు అభివృద్ధి చెందాలనే ఆలోచనతో ముందుకు వెళ్తామని పేర్కొన్నారు.

మత్స్యకారులతో కలిసి చెరువులో చేపల వేట

సామాన్య ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు రాహుల్ వినూత్న రీతిలో ప్రజలను ఆకట్టుకునే కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. బెగుసరాయ్ జిల్లాలో ఆదివారం ఆయన మత్స్యకారులతో కలిసి చెరువులో చేపల వేట నిర్వహించారు. దీనికి సంబంధించిన దశ్యాలను కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది. మాజీ మంత్రి, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ వ్యవస్థాపకుడు, విపక్ష కూటమి డిప్యూటీ సిఎం అభ్యర్థి ముకేశ్ సాహ్నీతో కలిసి రాహుల్ గాంధీ బోటు సాయంతో ఓ చెరువులోకి వెళ్లారు. ఈ క్రమంలోనే చేపలు పట్టేందుకుగానూ ముకేశ్ సాహ్నీ నీళ్లలోకి దిగి వలవేశారు. కాసేపటికి రాహుల్ గాంధీ సైతం నీళ్లలో దూకారు. మత్స్యకారులతో కలిసి చేపలు పట్టారు. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది.

ఇక 'పేదరిక నిర్మూలనే' లక్ష్యం



- ఇదే నినాదంతో 'స్థానిక' సమరం
- సిపిఎం కేరళ రాష్ట్ర కమిటీ

తిరువనంతపురం : తీవ్ర పేదరికాన్ని నిర్మూలించిన తొలి, ఏకైక రాష్ట్రంగా కేరళ అవతరించిన నేపథ్యంలో అక్కడి వామపక్ష, ప్రజాతంత్ర ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మరో బృహత్తర లక్ష్య సాధనకు సన్నద్ధమవుతోంది. రాష్ట్రంలో పేదరిక మాటే లేకుండా చేయాలని నడుం బిగిస్తోంది. గృహస్థాయిలో పేదరికాన్ని నిర్మూలించడంపై దృష్టి సారించింది. తిరువనంతపురంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ మాట్లాడుతూ తమ తదుపరి లక్ష్యం పేదరిక నిర్మూలన అని తెలిపారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే నినాదంతో ప్రచారం సాగిస్తామని తెలిపారు. ఇల్లు, జీవనోపాధి లేకపోవడం తదితరాలు పేదరికానికి ప్రధానకారణమని, ఇక రాష్ట్రంలో ఇటువంటి సమస్యలు లేకుండా చేయడానికి తమ ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆయన చెప్పారు. కేరళపై కేంద్రం 'ఆర్థిక ఆంక్షలు' కొనసాగిస్తున్నా...ప్రజలందరి సమిష్టి కృషితో కేరళ పురోగమిస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్రం రాష్ట్రానికి చెల్లించాల్సిన రూ. 2 లక్షల కోట్ల నిధులను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నీతి ఆయోగ్ నివేదిక

2021 నీతి ఆయోగ్ నివేదికలోని గణాంకాల ప్రకారం కేరళ జనాభాలో 0.7 శాతం మంది రోజువారీ పేదరికంతో బాధపడుతున్నారని గోవిందన్ చెప్పారు. రాష్ట్రంలో బహుముఖ పేదరికం 2025 నాటికి 0.7 శాతానికి తగ్గిందని నీతి ఆయోగ్ వెల్లడించిందని తెలిపారు. తీవ్ర పేదరికాన్ని నిర్మూలించగలిగితే.. బహుముఖ పేదరికాన్ని నిర్మూలించాలనే లక్ష్యం ప్రభుత్వానికి సులభంగా అందుబాటులో ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఈ లక్ష్యం సాధించడం కష్టమని ఆయన అన్నారు. ఉదాహరణకు బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్‌లో జనాభాలో 20 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని చెప్పారు. ప్రతిపక్ష నేత విడి సతీశన్ చెప్పినట్లుగా మంత్రదండంతో ఎల్‌డిఎఫ్ తీవ్ర పేదరికాన్ని నిర్మూలించలేదని అన్నారు. సమగ్రమైన కార్యాకచరణతోనే ఇది సాధ్యమైందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యవర్గ, రాష్ట్ర కమిటీ సమావేశాలకు ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఎల్‌డిఎఫ్ కన్వీనర్ టిపి రామకృష్ణన్ హాజరయ్యారని గోవిందన్ తెలిపారు. స్థానిక సంస్థ ఎన్నికల ప్రచారం కోసం రోడ్ మ్యాప్‌ను ఈ సమావేశాల్లో రూపొందించినట్లు గోవిందన్ వెల్లడించారు.



ఐద్వా అధ్యక్షులు శ్రీమతి టీచర్‌తో భహోతి, మరియం ధావలేతో కలిసి డ్యాన్స్ చేస్తూ..

90వ పడిలోనూ ఆటాపాటా

- ఐద్వా మహారాష్ట్ర మహాసభలో

చిందేసిన భహోతి

ముంబయి : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మహారాష్ట్ర రాష్ట్ర మహాసభలో 90 సంవత్సరాల వయస్సున్న బామ్మ ఆడిపాడి అందరినీ ఆకట్టుకుంది. దహను నుంచి మహాసభకు విచ్చేసిన భహోతి (90) ఉత్సాహాన్ని చూసి ఈ సభకు ముఖ్య అతిథిగా వెళ్లిన సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మరియం ధావలే సైతం ఆమెతో పదం కలిపారు. చిందులేశారు. భహోతి పోరాట ధీర. చారిత్రాత్మక కిసాన్ లాంగ్‌మార్చ్‌లో సైతం ఆమె పాల్గొన్నారు. పాదరక్షలు కూడా వేసుకోకుండా పాదాలు పగిలి రక్తమోడుతున్నా..నాటి లాంగ్‌మార్చ్‌లో 200 కిలోమీటర్లు నడిచారు. ఐద్వా రాష్ట్ర మహాసభ సందర్భంగా పాల్‌ఘడ్ జిల్లాలోని దహనులో శనివారం నిర్వహించిన బహిరంగసభకు 30 వేల మంది పైగా మహిళలు హాజరయ్యారు. ఈ సభకు గిరిజనులు, అణగారిన తరగతులకు చెందినవారు అత్యధికంగా తరలివచ్చారు. నసీమా షేక్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఐద్వా అధ్యక్షులు పికె శ్రీమతి టీచర్, ప్రధానకార్యదర్శి మరియం ధావలే, ఆహ్వాన కమిటీ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే వినోద్ నికోలే పాల్గొన్నారు.



హాయాఘాట్‌లో ఎర్రజెండా ఎగరాలి

- మహ్మద్ సలీం పిలుపు

పాట్నా : బీహార్‌లో ఎన్నికల ప్రచారంలో వామపక్షాల అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. హయాఘాట్‌లో సిపిఎం నుంచి పోటీ చేస్తున్న శ్యామ్ భారతికి మద్దతుగా పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు మహ్మద్ సలీం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. హయాఘాట్‌లో ఈ దఫా ఎర్రజెండా ఎగరాలని, శ్యామ్ భారతిని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల అపారమైన ప్రేమ, ఆదరణ చూస్తుంటే ఇక్కడ ఎర్రజెండా విజయఢంఖా మోగించడం ఖాయంగా కనిపిస్తోందని సలీం విశ్వాసం వ్యక్తం చేశారు.

హింసాత్మక ఘటనలను సహించం : సిఇసి

పాట్నా : బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల వేళ ఇటీవల జన్ సురాజ్ కార్యకర్త హత్యకు గురైన ఘటన నేపథ్యంలో ఎన్నికల సంఘం స్పందించింది. హింసను సహించేది లేదని భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా పోలింగ్ నిర్వహిస్తామన్నారు. కాన్పూర్‌లో ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'బీహార్‌లో ఎన్నికల నేపథ్యంలో హింసాత్మక ఘటనలను సహించే ప్రసక్తే లేదు. శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తాం. ప్రజాస్వామ్య పండుగలో ఓటర్లందరికీ అవకాశం లభిస్తుంది. శాంతి భద్రతల నడుమ పోలింగ్ జరుగుతుంది' అని ఆయన పేర్కొన్నారు.

ట్రక్కుపైకి దూసుకెళ్లిన టెంపో

- రాజస్తాన్‌లో 15 మంది మృతి



జైపూర్ : రాజస్తాన్‌లో మరో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఫలోదీ జిల్లాలో ఆదివారం రాత్రి ఆగి ఉన్న ఓ ట్రక్కుపైకి టెంపో ట్రావెలర్ దూసుకెళ్లిన ప్రమాదంలో 15 మంది మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను జోధ్‌పుర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. యాత్రీకులతో ఉన్న టెంపో బికనేర్‌లోని కొలాయత్ ఆలయాన్ని సందర్శించి జోధ్‌పుర్‌కు తిరిగి వస్తుండగా.. భారత్ మాలా హైవేపై మతోడా గ్రామం వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అధిక వేగంతో ఉన్న టెంపోను డ్రైవర్ నియంత్రించలేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లుగా పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. ట్రక్కులో నిర్మాణ సామాగ్రి ఉందని, చీకటిలో ట్రక్కును డ్రైవర్ గుర్తించలేకపోయాడని పోలీసులు తెలిపారు. మృతులను జోధ్‌పుర్‌లోని సూర్‌సాగర్ ప్రాంతానికి చెందినవారిగా గుర్తించారు. కాగా, రాజస్తాన్‌లో నెల వ్యవధిలోనే ఇది రెండో భారీ రోడ్డు ప్రమాదం. 20 రోజుల క్రితం జైసల్మీర్-జోధ్‌పూర్ హైవేపై బస్సు దగ్ధమైన ఘటనలో 20 మంది సజీవదహనమయ్యారు.

కంపెనీల ఇష్టారీతి దోపిడి

(మొదటిపేజి తరువాయి)

గ్రాస్ ప్రీమియంలో కేవలం 15 శాతమే రైతులకు తిరిగి పరిహారం రూపంలో చెల్లించాయి. గడచిన మూడేళ్లల్లో ఫసల్ బీమా కింద కంపెనీలు రూ.4,294 కోట్లు గ్రాస్ ప్రీమియం వసూలు చేసి రూ.930 కోట్లు రైతులకు పరిహారం చెల్లించాయి. వాతావరణ ఆధారిత బీమా కింద రూ.1,560 కోట్లు ప్రీమియం తీసుకొని రైతులకు ఒక్క రూపాయి కూడా పరిహారం చెల్లించలేదు. మొత్తంగా కంపెనీలు 85 శాతం లాభాలను తమ బొక్కసంలో వేసుకున్నాయి. ఇంత భారీ లాభం మరే వ్యాపారంలోనూ ఉండదేమో! కంపెనీలకు చెల్లించే ప్రీమియం సొమ్మును అన్నదాతలకు మళ్లించి నేరుగా సాయం చేస్తే కొంత మేరకైనా నగదు సాయం వారి చేతికందేది.

సాగుదార్లకు సున్నం

కేంద్రంలో మోడీ ప్రభుత్వం అంతకుముందున్న పంటల బీమా పథకాలను రద్దు చేసి 2016 ఖరీఫ్ నుంచి ఫసల్, వాతావరణ బీమాలను తీసుకురాగా, ఆ సమయంలో ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉన్న టిడిపి ప్రభుత్వం మన రాష్ట్రంలోనూ వాటిని మక్కిమక్కికి అమలు చేసింది. రైతులకు ఆ స్కీముల వలన ప్రయోజనం కలగట్లేదంటూ 2019లో అధికారంలోకొచ్చిన వైసిపి ఆ ఏడాది రబీ నుంచి ఉచిత పంటల బీమా పథకాన్ని తీసుకొచ్చి కంపెనీలతో ప్రమేయం లేకుండా తానే నిర్వహించింది. తదుపరి కేంద్రం ఒత్తిళ్లతో, 2022 ఖరీఫ్ నుంచి కేంద్ర పథకాల్లో చేరింది.

ఆ సంవత్సరం ఫసల్ స్కీము ఒక్కటే కంపెనీల నిర్వహణకు అప్పగించి వాతావరణ బీమాను తానే నిర్వహించింది. 2023 ఖరీఫ్ నుంచి రెండు పథకాలనూ కంపెనీల నిర్వహణకు అప్పగించింది. తొలేడాది ఖరీఫ్‌లోనే ఫసల్ స్కీంలో చెప్పుకోతగ్గ స్థాయిలో రైతులకు పరిహారం అందింది. అటు వైసిపి హయాంలో కానీ నేటి కూటమి ప్రభుత్వంలోకానీ కంపెనీల నుంచి పరిహారం అందింది చాలా తక్కువ. వైసిపి సర్కార్ ప్రీమియం నిధులు సకాలంలో చెల్లించకపోవడం వలన క్లెయిములు పెండింగ్‌లో ఉన్నాయని, వాటన్నింటినీ చెల్లిస్తామన్న కూటమి ప్రభుత్వం తన హామీని పూర్తి స్థాయిలో నిలబెట్టుకోలేదు. పైగా ఉచిత పంటల బీమా ఎత్తేసి రైతులు తమ వాటా ప్రీమియం చెల్లించుకోవాలని నిబంధనలు మార్చడంతో పథకాలు అంతంతమాత్రంగా తయారయ్యాయి.

కొసరంత..

కంపెనీలు రంగప్రవేశం చేశాక 2022 ఖరీఫ్‌లో ఫసల్ బీమాలో 25.28 లక్షల మంది రైతులు చేరితే 3.43 లక్షల మందికి పరిహారం అందింది.

ఆ ఏడాది రబీలో 15.22 లక్షల మందికిగాను 64 వేల మందికి, 2023 ఖరీఫ్‌లో 22.68 లక్షల మందికిగాను 98 వేల మందికి, ఆ ఏట రబీలో 12.92 లక్షల మందికిగాను 1.43 లక్షల మందికి కొద్దిపాటి పరిహారం దక్కింది. కూటమి వచ్చాక 2024 ఖరీఫ్‌లో ఉచిత పంటల బీమా అమలు చేశారు. ఆ సీజన్‌లో 24.05 లక్షల మంది రైతులు ఫసల్ బీమాలో చేరగా 82 వేల మందికి 8.53 కోట్ల పరిహారం అందింది. ఆ సంవత్సరం రబీ నుంచి ఉచిత బీమా ఎత్తేశారు. అప్పుడు 2.91 లక్షల మంది రైతులు పథకంలో చేరగా ఒక్క క్లెయిము కూడా సెటిల్ కాలేదు.

వెదర్.. జీరో

2023 ఖరీఫ్ నుంచి వాతావరణ బీమా నిర్వహణ కంపెనీల చేతుల్లోకి వెళ్లింది. ఆ సీజన్‌లో వెదర్ బేస్డ్ స్కీంలో 7.40 లక్షల మంది రైతులు చేరారు. వందల కోట్ల ప్రీమియం కంపెనీల గల్లా పెట్టెల్లో పడగా ఒక్క రూపాయి అయినా రైతులకు చెల్లించలేదు. 2023 రబీలో 1.92 లక్షల మంది రైతులు, కూటమి సర్కార్ వచ్చాక 2024 ఖరీఫ్‌లో 8 లక్షల మంది, ఆ ఏడాది రబీలో 15 వేల మంది వాతావరణ బీమా పథకంలో నమోదుకాగా ఒక్క రూపాయి కూడా రైతులకు ఇవ్వలేదు. ఈ కాలంలో విపత్తులు లేవా అంటే అదేమీకాదు. తుపాన్లు, భారీవర్షాలు, వరదలు, కరువులతో రైతులకు భారీగా పంట నష్టం వాటిల్లినా కంపెనీలు రైతులకు పరిహారం ఇవ్వలేదు.

ఉచిత పంటల బీమా పున:ప్రారంభించాలి

(మొదటిపేజి తరువాయి)

నమోదైనవారందరికీ ఆటోమేటిక్‌గా ఇన్సూరెన్స్ అప్లై అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కౌలుదారులకే పరిహారం అందించాలి

భూమిలేని కౌలుదారులు 91 శాతం మందికి తుపాను పరిహారం అందడం లేదని శ్రీనివాసరావు అన్నారు. 25 లక్షల మంది కౌలుదారులు ఉంటే కేవలం 4 లక్షల కార్డులే ఇచ్చారని, భూ యాజమాని సంతకం లేకుండా బ్యాంకులు రుణం ఇవ్వడం లేదని తెలిపారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తుపాను వల్ల 80 శాతం నష్టపోయింది కౌలుదారులేనని పేర్కొన్నారు. వీరికి రుణాలు ఇవ్వకుండా వ్యవసాయాన్ని ప్రభుత్వం ఎలా రక్షిస్తుందని ప్రశ్నించారు. గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలతో నిమిత్తం లేకుండా కౌలుదారుల దరఖాస్తులను సచివాలయాల్లో బహిరంగంగా విచారణ జరిపించి తుపాను నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలుదారులకు కాకుండా భూ యాజమానికి పరిహారం చెల్లించడం దారుణం, ఘోరమని ఆందోళన వ్యక్తం చేశారు. వరి పంట పండిస్తోంది ఎక్కువ మంది కౌలుదారులేనని చెప్పారు. ఈ పంట దెబ్బతింటే ఆహార భద్రతకు ముప్పు వస్తుందని మార్కెట్‌లో బియ్యం ధరలు పెరగడంతో పాటు దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. పంట నష్టం 33 శాతానికి మించితేనే రూ.10వేలు పరిహారం చెల్లించాలని వ్యవసాయ శాఖ ఆదేశాలు జారీ చేసిందన్నారు. పంట నష్టపరిహారం అందినవారి నుండి ధాన్యం కొనుగోలు చేయబోమని ఈ ఆదేశాల్లో వ్యవసాయశాఖ కొర్రి పెట్టిందన్నారు. దెబ్బతిన్న ధాన్యాన్ని మిల్లర్లకు అమ్ముకోవాలని, కొనుగోలు చేయొద్దని తమకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారన్నారు. మరోపక్క అందరి ధాన్యం కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల శాఖమంత్రి మాత్రం వివరణ ఇచ్చారని తెలిపారు. అలాంటప్పుడు వ్యవసాయ శాఖ తన ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నష్ట పరిహారంతో నిమిత్తం లేకుండా రైతులందరి నుంచి పౌరసరఫరాల శాఖ, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సిఐ)లు ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తడిచిన ధాన్యం కొనుగోల్లో నిబంధనలు సడలించాలని కోరారు. అనకాపల్లి జిల్లాలో తుమ్మపాల వద్ద మోకాలి లోతులో ఉన్న 300 ఎకరాల వరిపంట పొలాలను శనివారం తాను పరిశీలించానని తెలిపారు. ఈ పంటకు పరిహారం ఇప్పించాల్సిన సచివాలయ అధికారులు, మూడు నెలల నుంచి మునిగే ఉందని నమోదు చేయబోమన్నారని తెలిపారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు డ్రైనేజ్ వ్యవస్థను పూర్తిగా మూసివేయడంతో ఇవి మునిగాయన్నారు. కాలువలను తవ్వకుండా రియల్ ఎస్టేట్‌కు కొమ్ము కాసి మునిగిన పంటకు పరిహారం ఇవ్వబోమని అధికారులు చెప్పడం సరికాదని, రాష్ట్రంలో ఇలాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయని వివరించారు.

కాశీబుగ్గ సంఘటన ఘోరం

ఉత్తరాంధ్ర తిరుపతి అంటూ ప్రచారంలో ఉన్న దేవాలయం ప్రభుత్వ దృష్టిలో లేదని దేవాదాయశాఖ మంత్రి చెప్పడం సరికాదన్నారు. తుపానును అడ్డుకునే శక్తి ఉందని చెప్పుకుంటున్న వారికి దేవాలయంలో ఏం జరుగుతుందో తెలియకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో ఇంత పెద్ద దేవాలయాన్ని అప్పగించకూడదని, ఎవరికీ బాధ్యత ఉండదని, నిర్వాహకులు ఎవరికీ సమాధానం ఇవ్వరని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ గుడిని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకొని నియంత్రించాలని డిమాండ్ చేశారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన సాయం సరిపోదని, మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద జరిగిన సంఘటనలో ప్రభుత్వం తప్పించుకునే ధోరణి చూస్తుంటే ప్రజలకు భద్రత కల్పించేందుకు పోలీసులు ఉన్నారా? లేదా ప్రజా ఉద్యమాలను అణచి అంబానీ, అదానీలను ఆదుకోవడానికా? అనే మౌలిక ప్రశ్న తలెత్తుతోందన్నారు. అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో జరుగుతున్న ఆందోళన వద్దకు శనివారం తాము వెళ్తున్న దారిలో ప్రసిద్ధి చెందిన దేవాలయానికి పెద్దయెత్తున జనాలు వస్తే కేవలం ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారని తెలిపారు. శాంతియుత ఆందోళన వద్దకు తాము వెళ్తున్న మార్గంలో వందల సంఖ్యలో పోలీసులను మోహరించడంతో పాటు అడుగడుగున చెక్‌పోస్టులు పెట్టారని వివరించారు. ఇప్పటికైనా పోలీస్ వ్యవస్థను సంస్కరించాలని, ప్రజాపోలీస్‌గా మార్చాలని కోరారు. నిర్బంధ పోలీస్‌గా ప్రజలను అణచివేసే సాధనంగా పోలీస్ యంత్రాంగం ఉండకూడదన్నారు.

పేదరిక నిర్మూలనలో కేరళను రాష్ట్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకోవాలి

పేదరిక నిర్మూలనలో మన రాష్ట్ర ప్రభుత్వం కేరళ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకొని క్షేత్రస్థాయిలో స్థానిక సంస్థలను, ప్రజలను భాగస్వామ్యం చేసి ప్రభుత్వమే పేదరికాన్ని పరిష్కరించాలని శ్రీనివాసరావు సూచించారు. దేశంలోనే మొట్టమొదటి అత్యంత పేదరిక రహిత రాష్ట్రంగా కేరళను నీతి ఆయోగ్ ప్రకటించిందని, వామపక్ష ఉద్యమానికి ఇది పెద్ద విజయమని చెప్పారు. రాష్ట్రంలో పి4 పేరుతో పేదరికం నిర్మూలిస్తామని రాష్ట్ర ప్రభుత్వం డప్పు వాయిస్తుందని, కానీ ఈ పథకం కింద ఒక్కరు కూడా పేదరికం నుంచి బయటపడలేదన్నారు. కార్పొరేట్లు పెద్దగా స్పందించకపోవడంతో అధికార పక్షం కూడా పి4 ఫెయిలైందని అంగీకరిస్తుందని వివరించారు. ఇలాంటి పథకాలు, ప్రచార ఆర్భాటంతో పేదరిక నిర్మూలన సాధ్యం కాదన్నారు. పేదరికం నుంచి బయటపడేందుకు అవసరమైన మౌలిక సమస్యలను పంచాయతీల ఆధ్వర్యంలో అన్ని శాఖలు సమన్వయం చేసుకొని కేరళలో పరిష్కరించి పేదరికాన్ని అధిగమించారని తెలిపారు. రాష్ట్రంలో తీవ్ర పేదరికం 17 శాతం ఉంటే కేరళలో 0.7 శాతం మాత్రమే ఉందని పేర్కొన్నారు.

ఆగని ఇజ్రాయిల్ దాష్టీకాలు

- మానవతా సాయానికి మళ్లీ అడ్డంకులు

గాజా : పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ తన అమానవీయ దాడులను కొనసాగిస్తూనేవుంది. సహాయ సామగ్రితో గాజా నగరంలోకి ప్రవేశిస్తున్న వాహనాలను ఇజ్రాయిల్ దళాలు అడ్డుకుంటున్నాయి. గాజా స్ట్రిప్‌లోకి ప్రతి రోజూ 600 ట్రక్కులను అనుమతిస్తానని హామీ ఇచ్చిన ఇజ్రాయిల్ కేవలం 145 ట్రక్కులనే పంపుతోంది. గాజాలో తీవ్ర అనారోగ్యానికి గురై ప్రత్యేక చికిత్స అవసరమైన 16 వేల మందికి పైగా రోగులను అక్కడి నుంచి తరలించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటోంది. సెప్టెంబర్ నాటికి ఈజిప్టుకు 3,995 మంది రోగులను, యుఎఇకి 1,450 మందిని, ఖతార్‌కు 970 మందిని, తుర్కియేకు 437 మందిని చికిత్స నిమిత్తం తరలించారు. ఇటలీలో 201 మంది రోగులకు చికిత్స అందించారు. పాలస్తీనాకు చెందిన 3,800 మంది చిన్నారులకు అత్యవసర వైద్య చికిత్స అవసరమున్నదని, వారిని గాజా నుంచి తరలించాలని ఐక్యరాజ్యసమితి గత వారం తెలిపింది. ఇరుకుగా, సన్నగా ఉండే ఫిలిడెల్ఫి కారిడార్ మీదుగానే సహాయ సామగ్రి రవాణాకు అనుమతిస్తూ, ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకుండా ఇజ్రాయిల్ అడ్డుకుంటోంది.

ఎస్‌ఐఆర్‌తో ప్రజాస్వామ్యం ఖూనీ

(మొదటిపేజి తరువాయి)

మరో 11 రాష్ట్రాల్లో ఎస్‌ఐఆర్ చేపట్టడం ఎన్నికల సంఘం ఒంటెద్దు పోకడగా చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదని పేర్కొంది. ప్రజాస్వామ్య పునాదులను దెబ్బతీసేలా అణగారిన తరగతులకు చెందిన ప్రజల ఓటు హక్కును హరించివేయడం అన్యాయం అని పేర్కొంది.

ఈశాన్య రుతుపవనాల సమయంలో..

తమిళనాడులో ఈ నెల 4 నుంచి డిసెంబరు 4 వరకు ఎస్‌ఐఆర్ ప్రక్రియను చేపట్టనున్నారని, ఇదే సమయంలో ఈశాన్య రుతుపవనాలు ఉచ్ఛస్థితిలో ఉండే వీలుందని, అలాంటప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, ఇతర పేద ప్రజలు తమ ఓటు హక్కు కోసం కార్యాలయాలు చుట్టూ తిరగాలా? అని సమావేశం ప్రశ్నించింది. పైగా రెవెన్యూ శాఖ అధికారులు కూడా భారీ వర్షాల ప్రభావిత సమస్యలు పరిష్కరించడంలో నిమగ్నైవుంటారని, పనిగట్టుకొని ఇదే సమయం ఎస్‌ఐఆర్ చేపట్టేందుకు ఎంచుకోవడం ఎవరి ప్రయోజనాల కోసమని నిలదీసింది. ఎన్నికల జాబితా నుంచి గ్రామీణ పేదలను తొలగించేందుకే ఈ ప్రక్రియ చేపడుతున్నారా అంటూ సమావేశం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో డిఎంకె, డిఎండికె, వామపక్షాలు సహా 44 పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. బిజెపిని, ఎఐఎడిఎంకెని సమావేశానికి ఆహ్వానించలేదు. ఎస్ రాందాస్‌కు చెందిన పట్టాయ్ మక్కాల్ కచ్చి (పిఎంకె), సినీ నటుడు విజయ్‌కి చెందిన తమిళగ వెట్రి కఝగం(టివికె), టిటివి దినకరన్‌కు చెందిన ఎఎంఎంకె, నామ్ తామిజార్ కచ్చి (ఎన్‌టికె) ని ఆహ్వానించినా ఈ సమావేశానికి దూరంగా ఉన్నాయి.



మీకోసం


ఎండుమిర్చి ముక్కలను చల్లి మాంసాన్ని వేయిస్తే బంగారు గోధుమ రంగులో వస్తుంది.

జీవన సౌరభం

అభ్యాసం సృజనాత్మకతను ఇస్తుంది. సృజన ఆలోచనా శక్తిని పెంచుతుంది.

JEEVANA జీవన the family

తాత గారి వయస్సు



మార్జల వైరి వాహన మాత పురం అనే ఊరిలో ఒక తాత గారు ఉన్నారు. ఆయన పేరు **సక్సెస్ సన్ రెడ్డి.** ఎప్పుడూ నీతులు, గొప్పలు, సామెతలు, పొడుపు కథలు, సూక్తులు, బేతాళ కథలు చెబుతూ అందర్నీ నవ్విస్తూ, ఆట పట్టిస్తూ ఉండేవారు. ఒకరోజు ఆ తాత గారికి **100న రావు** అనే టీచర్ ఎదురు పడ్డారు. 'తాత గారూ... మీరు ఎప్పుడూ చాలా సరదాగా, సంతోషంగా ఉంటూ అందరికీ రకరకాల ప్రశ్నలు వేస్తూ ఉంటారు కదా. ఇంతకి మీ వయస్సు ఎంత? అని అడిగారు. అప్పుడు తాత గారు తన వయస్సును కూడా మెదడుకు పదును పెట్టే విధంగా చెప్పారు.

"నా వయస్సును ముందు నుండి చూసినా, తలకిందులు చేసి, చదివినా మారదు. అలాగే నా భార్య పేరు **సాం3.** అదేంటోగాని, **గమ్మత్తుగా, నా భార్య వయస్సు కూడా, నా వయస్సు వలె తలకిందులు చేసి చదివినా మారదు. మరో విశేషం ఏమిటంటే ఇప్పుడు ఉన్న నా వయస్సుకు 27 సంవత్సరాల క్రితం నాటికి, ప్రస్తుతం నా భార్య వయస్సుకు సమానం అవుతాను'** అని చెప్పారు. ఈ కథలో తాత గారి వయసు ఒక్కటే కాదు, ఇంకా కొన్ని గమ్మత్తులు ఉన్నాయి. కథలో వాటిని ముద్ద అక్షరాల్లో ఇచ్చాం. వాటి అర్థాలు ఏమిటో కనిపెడతారా?ప్రయత్నించండి. మీ సమాధానాలు కింద ఇచ్చిన అంశాలతో సరిచూసుకోండి.

1. తాత గారి ఊరు పేరు :
మార్జల్య వైరి వాహన మాత పురం అంటే పార్వతీపురం

2. తాత గారి పేరు :
సక్సెస్ సన్ రెడ్డి అంటే విజయ భాస్కర రెడ్డి


3. తాత గారి భార్య పేరు : సాం3 అంటే సావిత్రి

4. మాస్టర్ పేరు : 100న రావు అంటే వందన రావు

5. తాత గారి వయస్సు : 96 సంవత్సరాలు

6. తాత గారి భార్య వయస్సు : 69 సంవత్సరాలు

– మద్దు తిరుపతి రావు
గణిత అవధాని, టీచరు బూరగాం,
కంచిలి, శ్రీకాకుళం,
94913 26473.



జవాబు రాయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను కలిపి, పక్కనే ఉన్న బాక్సుల్లో జవాబు రాయండి.

నేను గీసిన బొమ్మ





కె.హేమశ్రీ,
7వ తరగతి,
జెడ్పీహెచ్ఎస్,
కట్టుబడిపాలెం,
జి.కొండూరు మండలం,
ఎన్‌టిఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వర్షాకాలంలో ఆహార జాగ్రత్తలు



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పెరుగుతాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్, జలుబు, దగ్గు, ఇన్ఫ్లుయెంజా వంటి వ్యాధులు దాదాపు ప్రతి ఇంటిని తాకుతాయి. ఈ సమయంలో ఆరోగ్య సంరక్షణ ఎంతో ముఖ్యం. ఇది ఎక్కువగా తాగే నీరు, తినే ఆహారం పైన ఆధార పడి ఉంటుంది. వర్షాకాలంలో తాగే మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం పొంచివుంది. వర్షాలు కురిసే సమయంలో ఎక్కువగా తడిస్తే అనారోగ్య సమస్యలు దాపురిస్తాయి. కొన్ని చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి రోగం మనల్ని దరిచేరకుండా ఉంటుంది.

రక్షిత మంచినీరే మేలు : మంచినీటిని 100 సెంటీగ్రేడ్ వద్ద మరిగించి చల్లార్చి తాగడం, లేదా యువి పూరిఫైడ్, ఆర్ఒ ఫిల్టర్ చేసిన నీటిని ఉపయోగించడం తప్పనిసరి. డయోరియా (అతిసార), టైఫాయిడ్, కలరా, హెపటైటిస్ ఎ వంటి వ్యాధులు ఇలాంటి వాతావరణంలోనే వస్తాయి. సురక్షితమైన నీటిని తాగటం వల్ల కొంతమేర వ్యాధుల నుంచి బయటపడొచ్చు. చలి వాతావరణంలో చాలామంది మానసిక ప్రశాంతతకు వేడివేడి టీ, కాఫీ వంటివి సేవిస్తుంటారు. కొంతమేరకు మంచి ఉల్లాసాన్ని ఇస్తాయి. వీటిలో ఉండే కెఫీన్, పాలీఫినాల్స్ యాంటీ ఆక్సిడెంట్స్‌గా ఒత్తిడి చేస్తాయి. అధికంగా తాగితే అసిడిటి, డీహైడ్రేషన్ వంటి సమస్యలు వస్తాయి. రోజుకి రెండు లేదా మూడు కప్పులు సరిపోతాయి. టీ లేదా కాఫీ అలవాటు లేని వారు వేడివేడిగా కార్న్ సూప్, వెజిటబుల్ సూప్, అల్లం సూప్, చికెన్ సూప్ వంటి ద్రవాలను తీసుకోవచ్చు. వీటివల్ల శరీరానికి వేడి పెరిగి, తేమ వల్ల కలిగే వాపులు తగ్గుతాయి.

మంచి నిద్రా ముఖ్యమే : ఆరోగ్యానికి ఆహారం ఎంత ముఖ్యమో, నిద్ర అంతకంటే ముఖ్యం. చల్లటి వాతావరణం కొందరికి అలసట, నిద్రలేమి కల్గిస్తుంది. పడుకునే ముందు అరటిపండు, గోరువెచ్చని పాలు తాగడం వల్ల శరీరానికి ప్రశాంతత లభిస్తుంది. అరటిపండులో ఉన్న మెగ్నీషియం, పొటాషియం రక్తపోటు తగ్గిస్తాయి. ట్రిప్టోఫాన్ అనే అమీనో ఆమ్లం సెరోటోనిన్‌ను తయారు చేయడంలో సహాయపడుతుంది. ఇది మనసు ప్రశాంతంగా ఉండటానికి తోడ్పడుతుంది.

దోమకాటుకు గురి కావొద్దు : వర్షాల వల్ల నిల్వ నీరు దోమల పెంపక కేంద్రాలుగా మారుతుంది. ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమలు నివారణకు మస్కిటో కాయిల్స్, లిక్విడ్ వెపరైజర్లు వాడాలి. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు సకాలంలో తొలగించాలి. లేకపోతే దోమల ఉధృతి మరింత పెరుగుతుంది.

ఇవి పాటించండి

- వర్షాల వల్ల బయటకు వెళ్లే అవకాశం లేకపోయినా ఇంట్లో అయినా వ్యాయామం చేయాలి.
- మానసికంగా ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి
- తడి బట్టలు వెంటనే మార్చాలి. శరీరం తడిగా ఎక్కువసేపు ఉంచితే ఫంగల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది.
- బయటకు వెళ్లేటప్పుడు రెయిన్‌కోట్, గొడుగు తప్పనిసరిగా వాడాలి.
- బయట చల్లని ఆహారాలు తినొద్దు. మంచినీరు తాగొద్దు.
- బయటి తిండి తినకూడదు.
- శీతల పానీయాలకు దూరంగా ఉండాలి.

వంటిల్లే వైద్యశాల

మన వంటిల్లు వైద్యశాల వంటిది. అందులో ఉండే అల్లం, వెల్లుల్లి, మిరియాలు, పసుపు, లవంగాలు, జీలకర్ర, ఏలకులు, వాము వంటి దినుసులు సహజ సిద్ధమైన యాంటీబయాటిక్స్‌లా పనిచేస్తాయి. అల్లంలో ఉండే జింగెరో 1, వెల్లుల్లిలోని అల్లిసిన్, మిరియాల్లోని పైపెరిన్; పసుపులోని కర్కుమిన్, లవంగాల్లోని ఇగినల్, జీలకర్రలోని థైమోల్ వంటి పదార్థాలు శరీరంలోని వాపులను తగ్గించి, రక్తంలో హానికరమైన కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తాయి.

- ప్రతిరోజూ ఒక చిన్న అల్లం ముక్క, వెల్లుల్లి ఆహారంలో జోడించాలి.
- ఆహారంలో ప్రోటీన్లు, గుడ్లు, చికెన్, చేపలు, పాలు, పప్పు ధాన్యాలు, పన్నీరు, మష్రూమ్స్ ఉండేలా చూసుకోవాలి.
- విటమిన్ ఎ ఎక్కువగా ఉండే క్యారెట్లు, బొప్పాయి, గుమ్మడికాయ, ఆకుకూరలు, గుడ్డు, పాలు తీసుకోవాలి.
- విటమిన్ సి ఉండే ఉసిరి, కమల, జామ, బత్తాయి, నిమ్మ వంటివి కూడా తినటం మేలు.
- విటమిన్ ఇ ఎక్కువగా ఉండే బాదం, పిస్తా, సన్‌ఫ్లవర్ సీడ్స్, అవకాడో వంటివి తీసుకోవాలి.
- జింక్, ఐరన్ వంటివి ఎక్కువగా చిక్కుళ్లు, పాలకూర, బీన్స్, బీట్‌రూట్ వంటివిలో విరివిగా ఉంటాయి.
- పై వాటిని తీసుకోవటం వల్ల శరీరానికి పోషణతో పాటు వైరస్, బ్యాక్టీరియా దాడి నుండి రక్షణ లభిస్తుంది.
- ఎక్కువగా వర్షంలో తడవకుండా ఉంటే చాలా వరకూ కొన్ని రకాల వ్యాధుల నుంచి బయటపడొచ్చు.
- జలుబు, దగ్గు, చిన్నపాటి జ్వరం ఉంటే కాచి చల్లార్చిన నీటిని తాగుతూ ఉండాలి. ఎలాంటి పరిస్థితుల్లో మంచినీటిని నేరుగా తీసుకోవొద్దు.

– వంట చేయడానికి ముందు కూరగాయలు, తినే ముందు పండ్లను బాగా కడగాలి. దుమ్ము, ధూళి, హానికరమైన బ్యాక్టీరియాకు ఇవి గురవుతూ వైరల్ ఇన్ఫెక్షన్‌లను కల్గిస్తాయి.

- వేడివేడి ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలి. నిల్వవుంచిన ఆహార పదార్థాలను తింటే ఇన్‌ఫెక్షన్ వచ్చి రోగ నిరోధక శక్తి తగ్గే అవకాశం ఉంటుంది. .

– భోజనానికి ముందు, తర్వాత వేడి నీళ్లతో చేతులు కడుక్కోవాలి. దగ్గు, జలుబుతో బాధపడుతుంటే మీ ఆహారం, పానీయాలను ఎవరితోనూ పంచుకోవద్దు.




– డాక్టర్ శాంతిశ్రీ కె.వి.
అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫుడ్‌సైన్స్,
ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం, గుంటూరు

పెదాల పరిరక్షణ ఇలా ...

చలికాలంలో పెదవులు పగిలి ఇబ్బంది పెడతాయి. పెదాలు పొడిగా మారి, చర్మం చీలి ఒక్కోసారి రక్తం కూడా వస్తుంది. ఆ నొప్పి, మంట భరించలేనిది. అందుకే పెదాలు పగలకుండా, పగిలినప్పుడు మృదువుగా చేయడానికి కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుంది.

- బాదం నూనెలో విటమిన్ ఎ, విటమిన్ ఇ, విటమిన్ డి, పొటాషియం, ఐరన్, కాల్షియం, జింక్, ఫాస్పరస్, మాంగనీస్, ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఈ పోషక కారకాలు పెదాలను మృదువుగా మారుస్తాయి. పగుళ్లు రాకుండా రక్షిస్తాయి. స్నానం తర్వాత పెదవులను శుభ్రం చేసి బాదం నూనెను రాసి సున్నితంగా మర్దన చేస్తూ ఉండాలి. దాంతో రోజంతా పెదాలపై తేమ ఉండి పగలకుండా ఉంటాయి.



- కొబ్బరి నూనెలో కొవ్వు ఆమ్లాలు తేమను కలిగిస్తాయి. రోజుకు 2–3 సార్లు పెదవులపై రాయండి. దీంతో పెదవుల నొప్పి నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.
- తేనెలో యాంటిసెప్టిక్, యాంటీబయాటిక్, విటమిన్ బి 1, విటమిన్ బి 6 కూడా సమృద్ధిగా ఉంటాయి. పగిలిన పెదవులకు తేనెతో మర్దన చేయడం వల్ల మంట, నొప్పి వెంటనే తగ్గుతుంది.
- వెన్నలో ఉండే మంచి కొవ్వు పదార్థాలు శరీర గాయాలకు వెంటనే ఉపశమనం కలిగిస్తాయి. ఇందులోని అరాచిడోనిక్ యాసిడ్ పెదాలపై పగుళ్లను ఐదు, ఆరు గంటల్లో తగ్గిస్తాయి. పడుకునే ముందు వెన్న రాసుకుంటే ఉదయాకల్లా పగుళ్లు ఉండవు.

షెఫాలీ వర్మ, దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షో


ఐసిసి 2025 మహిళల వన్డే వరల్డ్‌కప్



కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్‌కు ప్రపంచకప్ అందజేస్తున్న ఐసిసి ఛైర్మన్ జైషా

ముంబయి : ఐసిసి మహిళల వన్డే వరల్డ్‌కప్ ట్రోఫీ మన సొంతమైంది. గ్రూప్ దశలో మిశ్రమ ప్రదర్శనతో కంగారు పెట్టినా.. సెమీఫైనల్లో అసమాన రీతిలో ఆస్ట్రేలియాను ఓడించిన భారత్ ఆదివారం ముంబయిలోని డివై పాటిల్ స్టేడియంలో జరిగిన టైటిల్ పోరులోనూ అదరగొట్టింది. పిచ్‌పై తేమ, పదునైన పేస్‌తో ఆరంభంలో వికెట్లు ఆశించిన సఫారీలకు ఓపెనర్లు షెఫాలీ వర్మ (87), స్మృతీ మంధాన (45) చెక్ పెట్టారు. ఓపెనర్లు పవర్‌ప్లేలో వికెట్ నష్టపోకుండా 64 పరుగులు జోడించారు. మంధాన, షెఫాలీ మెరవటంతో తొలి వికెట్‌కు భారత్ 104 పరుగులతో అదిరే ఆరంభం అందుకుంది. 5 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 49 బంతుల్లోనే షెఫాలీ అర్ధ శతకం సాధించింది. సెమీస్ స్టార్ జెమీమా రొడ్రిగ్స్ (24)తో కలిసి షెఫాలీ మరో 62 పరుగుల భాగస్వామ్యంలో మెరిసింది. ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో మెరిసిన షెఫాలీ వన్డేల్లో కెరీర్ ఉత్తమ స్కోరు సాధించింది.

ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (58), వికెట్ కీపర్ రిచా ఘోష్ (34) ఆఖర్లో భారత ఇన్నింగ్స్‌ను నడిపించారు. సహజశైలిలో నెమ్మదిగా ఆడిన దీప్తి వికెట్ల మధ్య చురుగ్గా పరుగులు తీసింది. 2 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 53 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించింది. రిచా ఘోష్ కాస్త వేగంగా ఆడింది. 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో ధనాధన్ షో చూపించింది. దీంతో భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 298 పరుగుల భారీ స్కోరు చేసింది. మిడిల్‌లో (11–40 ఓవర్లు) 4 వికెట్లకు 165 పరుగులు చేసిన భారత్.. ఆఖరు పది ఓవర్లలో 3 వికెట్లకు 69 పరుగులు సాధించింది. ఆరంభంలో షెఫాలీ, మంధాన... ఆఖర్లో దీప్తి శర్మ, రిచా ఘోష్‌లు బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడారు. సఫారీ బౌలర్లలో ఖకా (3/58) మూడు వికెట్లతో రాణించింది.



ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ దీప్తి శర్మ

లారా పోరాటం వృథా : సఫారీ లక్ష్యం 299 పరుగులు. ఓపెనర్లు లారా వోల్వార్ట్ (101), టజ్మిన్ బ్రిట్స్ (23) చక్కటి భాగస్వామ్యం అందించారు. తొలి వికెట్‌కు ఓపెనర్లు 52 పరుగులు జోడించారు. వికెట్ల మధ్య పరుగులో సమన్వయ లోపంతో బ్రిట్స్ రనౌట్‌గా నిష్క్రమించింది. ఓపెనర్ లారా వోల్వార్ట్ ఓ ఎండ్‌లో నిలబడింది. దూకుడుగా ఆడుతూ రన్‌రేట్‌ను నియంత్రణలో ఉంచింది. సునె లుస్ (25), లారా జోడీ మూడో వికెట్‌కు 51 బంతుల్లో 52 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఇక్కడే హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్సీ మంత్రాంగం పని చేసింది. పార్ట్‌టైమ్ స్పిన్నర్ షెఫాలీ వర్మ చేతికి బంతిని ఇచ్చిన హర్మన్‌కౌర్.. వరుస ఓవర్లలో వికెట్లు రాబట్టుకుంది. లుస్ రిటర్న్ క్యాచ్‌తో నిష్క్రమించగా.. మారిజానె కాప్ (4) లెగ్‌సైడ్ షాట్‌కు వెళ్లి వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చింది. షెఫాలీ వరుస ఓవర్ల వికెట్లు దక్షిణాఫ్రికాను కోలుకోలేని దెబ్బకొట్టింది.

స్కోరు వివరాలు :

భారత్ ఇన్నింగ్స్ : స్మృ మంధాన (సి) జఫ్టా (బి) ట్రయాన్ 45, షెఫాలీ వర్మ (సి) లుస్ (బి) ఖకా 87, జెమీమా రొడ్రిగ్స్ (సి) వొల్వోర్ట్ (బి) ఖకా 24, హర్మన్‌ప్రీత్ కౌర్ (బి) మలబా 20, దీప్తి శర్మ (రనౌట్) 58, ఆమన్‌జోత్ కౌర్ (సి,బి) డిక్లర్క్ 12, రిచా ఘోష్ (సి) డెర్క్‌సెన్ (బి) ఖకా 34, రాధ నాటౌట్ 3, ఎక్స్‌ట్రాలు : 15, మొత్తం : (50 ఓవర్లలో 7 వికెట్లకు) 298.

బౌలింగ్ : మారిజానె కాప్ 10–1–59–0, అయబొంగ ఖకా 9–0–58–3, మలబా 10–0–47–1, నదినె డిక్లర్క్ 9–0–52–1, సునె లుస్ 5–0–34–0, చోలె ట్రయాన్ 7–0–46–1.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : లారా వోల్వోర్ట్ (బి) ఆమన్‌జోత్ (బి) దీప్తి 101, టజ్మిన్ బ్రిట్స్ (రనౌట్) 23, బాచ్ (ఎల్బీ) శ్రీచరణి 0, సునె లుస్ (సి,బి) షెఫాలీ వర్మ 25, మరిజానె కాప్ (సి) ఘోష్ (బి) షెఫాలీ వర్మ 4, సినాలో జాఫ్టా (సి) రాధ (బి) దీప్తి 16, అనెరి డెర్క్‌సెన్ (బి) దీప్తి 35, ట్రయాన్ (ఎల్బీ) దీప్తి 9, నదినె (సి) హర్మన్‌ప్రీత్ (బి) దీప్తి 18, ఖకా (రనౌట్) 1, మలబా నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 14, మొత్తం : (45.3 ఓవర్లలో ఆలౌట్) 246.

బౌలింగ్ : రేణుక సింగ్ 8–0–28–0, క్రాంతి గౌడ్ 3–0–16–0, ఆమన్‌జోత్ కౌర్ 4–0–34–0, దీప్తి శర్మ 9.3–0–39–5, శ్రీ చరణి 9–0–48–1, రాధ యాదవ్ 5–0–45–0, షెఫాలీ వర్మ 7–0–36–2.

హిట్‌మంత్రంగా మల్టీ స్టారర్ మూవీలు

తెరపై ఒక కథానాయకుడు కనిపిస్తేనే.. థియేటర్లలో ప్రేక్షకుల హంగామా ఓ స్థాయిలో ఉంటుంది. అదే ఒకే సినిమాలో ఇద్దరు కథానాయకులు ఉంటే అభిమానుల సందడికి అంతుండదు. భారీ వసూళ్లతో బాక్సాఫీస్ ముందు రికార్డుల మోత మోగుతుంటాయి. మల్టీస్టారర్ చిత్రాలు చేసే మ్యాజిక్ ఇది. సినీ పరిశ్రమ ప్రారంభం నుంచి ఈ తరహా సినిమాలు వస్తూనే ఉన్నాయి. వాటిలో చాలా వరకు బాక్సాఫీస్ ముందు హిట్టు మాట వినిపించుకున్నాయి. ఏటేటా ఈ తరహా చిత్రాల సందడి గట్టిగానే కనిపిస్తోంది. వాటిలో చాలా వరకు అగ్రతారల సినిమాలే ఉన్నాయి.

కొత్త సినిమాల జోరు

చిరంజీవి– వెంకటేష్, నాగార్జున–పవన్‌కళ్యాణ్, ప్రభాస్– రాజశేఖర్, చిరంజీవి–నాగార్జున, వెంకటేష్–బాలకృష్ణ, పవన్‌కళ్యాణ్–చిరంజీవి... ఇలా పెద్ద కథానాయకుల సినిమాలు వస్తే ఎలాగుంటుందనే చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. బాలకృష్ణ– ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్–బాలకృష్ణ కాంబినేషన్‌లో సినిమాలపై కూడా ఇండస్ట్రీలో చర్చలు జరుగుతున్నాయి. ఇప్పటికే కొన్ని సినిమాలకు సంబంధించిన కథలు సిద్ధమయ్యాయి. ఆర్‌ఆర్‌ఆర్, భీమ్లానాయక్, బంగార్రాజు, ఆచార్య వంటి మల్టీస్టారర్ సినిమాలు ప్రేక్షకారణ పొందిన విషయం తెలిసిందే. కేఎస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో తెరకెక్కిన 'వాల్తేరు వీరయ్య'లో చిరంజీవి, రవితేజ నటించి బ్లాక్‌బస్టర్‌ను అందుకున్నారు. 'అన్నయ్య' (2000) సినిమాలో చిరంజీవి తమ్ముడు పాత్రలో రవితేజ నటించారు. వెంకటేష్, సల్మాన్‌ఖాన్, రామ్‌చరణ్ హిందీ చిత్రం 'కిసీ కీ భాయ్ కీసీ కీ జాన్'లో స్క్రీన్ షేర్ చేసుకున్నారు. 'మనం', 'బంగార్రాజు' చిత్రాల్లో పెద్ద కుమారుడు నాగచైతన్యతో కలిసి నాగార్జున నటించారు. అక్కినేని నాగేశ్వరరావు, నాగార్జున, నాగచైతన్య నటించిన 'మనం'లో అఖిల్ గెస్ట్‌రోల్‌లో నటించారు.

'అగ్ని నక్షత్రం' కోసం తొలిసారి తండ్రీకూతురు మంచు మోహన్ బాబు, మంచు లక్ష్మి స్క్రీన్ షేర్ చేసుకున్నారు. పవన్ కళ్యాణ్ తన మేనల్లుడు సాయి దుర్గాతేజ్ 'బ్రో' చిత్రంలో నటించారు. ఆర్‌ఆర్‌ఆర్‌లో ఎన్టీఆర్, రామ్‌చరణ్ పోటీపడి మరీ నటించారు. బీమ్లానాయక్‌లో పవన్ కళ్యాణ్, దగ్గుపాటి రానా మధ్య మంచి కాంబినేషనే నడిచింది. కథానాయకుడు వెంకటేష్, వరుణ్‌తేజ్‌తో కలిసి నటించిన ఎఫ్2 సిరీస్ ఇంకా ఈ జోడీతో సీక్వెల్‌గా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభాస్– రానా నటించిన బాహుబలి సీక్వెల్స్ ప్రపంచస్థాయి గుర్తింపును పొందాయి. ప్రభాస్ నటించిన 'సలార్'లో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ తన సత్తా చాటారనే చెప్పొచ్చు. మంచు విష్ణు భక్త కన్నప్పలో శివుడిగా ప్రభాస్ నటించారు.

రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన కూలీ మూవీ మిశ్రమ ఫలితాన్ని అందుకుంది. ఆ దర్శకుడే కమల్‌హాసన్–రజనీకాంత్‌లతో మల్టీస్టారర్ కోసం ఓ కథను సిద్ధం చేశారు. కమల్‌హాసన్ ఏజ్డ్ గ్యాంగ్‌స్టర్స్‌గా కనిపించనున్నారు. తన సొంత బ్యానరైన రాజ్ కమల్ ఇంటర్నేషనల్ పతాకంపై కమల్‌హాసన్ ఈ సినిమాను నిర్మించనున్నట్లు సమాచారం. 1979లో విడుదలైన అల్లావుద్దీన్ అద్భుత విలక్కుమ్ రజనీకాంత్, కమల్‌హాసన్ కాంబినేషన్‌లో వచ్చిన చివరి మూవీ. 47 ఏళ్ల తర్వాత మళ్లీ వీళ్లిద్దరూ మల్టీస్టారర్‌లో నటించబోతున్నారు.

కలిసి చేస్తాం కథలు రాస్తే...

వెంకటేష్ తన 75 సినిమాల ప్రయాణాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకలో చిరంజీవి మాట్లాడుతూ... వెంకీతో కలిసి నటించడానికి సై అని చెప్పారు. వెంకటేష్ కూడా ఆయన కూర్చుని సైగ చేస్తే చాలు.. వెనక నుంచి నేను వచ్చేస్తా అని చెప్పారు. నాగార్జున... యువతరం హీరోలు అల్లరి నరేష్, రాజ్‌తరుణ్‌తో కలిసి 'నా సామిరంగ' చేశారు. వెంకటేష్–త్రివిక్రమ్ దర్శకత్వంలో ప్రారంభమైన సినిమాలు నాని కూడా ఉంటారనే ప్రచారం జరుగుతోంది. కొన్నేళ్లుగా మల్టీస్టారర్ చిత్రాలు అడపా దడపా సందడి చేస్తూనే ఉన్నాయి. అభిమాన హీరోల్ని కలిసి చూడాలనే కోరికని కొంత మేర తీరుస్తున్నాయి. వాటితోపాటే కొత్త రకమైన కథలూ వెలుగులోకి వస్తున్నాయి. ఇది మంచి పరిణామమే. అయితే వాటి సంఖ్య మరింత పెరిగితే చూడాలనేది ప్రేక్షకుల కోరిక. కథలు రాయొచ్చు కానీ.. కథానాయకులు కలిసి నటిస్తారా? అనే సందేహం వెనక్కు లాగేది గతంలో. కానీ ఇప్పుడు కథానాయకులే 'తమకు తగిన కథలొస్తే రెడీ' అంటున్నారు. రవితేజ – నాని కలిసి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. కలిసి సినిమా చేస్తామనే నిర్ణయం ప్రకటించారు. రవితేజ, కొందరు యువ కథానాయకుల కలయికలో కొన్ని ప్రాజెక్టులు కూడా ప్రచారంలో ఉన్నాయి. అందుకోసం స్క్రిప్ట్‌లు కూడా సిద్ధమయ్యాయి. కథానాయకులు ఇద్దరికీ సమయం కుదిరినప్పుడే ఇలాంటి చిత్రాలు పట్టాలెక్కే అవకాశాలు ఉంటాయి.

భారీబడ్జెట్లు

ఒక్క హీరోకే పారితోషికం తడిచిమోపెడు అవుతున్న తరుణంలో ఇద్దరైతే బడ్జెట్లు రెట్టింపు అవుతుంది. ఈ మధ్య సీనియర్ హీరోలు, యువతరం కథానాయకుల కలయికల్లో సినిమాలు కుదురుతున్నట్టుగా ఒకే స్థాయి తారల సినిమాలు కుదరడం లేదు. రెమ్యూనరేషన్‌కే ఉన్న బడ్జెట్టు అయిపోతే మిగతా ప్రొడక్షన్‌కు వ్యయం మరింత భారం కానుంది. ఇద్దరు అగ్ర కథానాయకులు కలిసి నటిస్తున్నప్పుడు వారి పారితోషికాలు, ఆ సినిమాల స్థాయికి తగ్గట్టుగా మార్కెట్ కూడా ఉండాలి. ఆ లెక్కల దగ్గర చాలా సినిమాలు ఆగిపోతున్నాయనేది సినీ విశ్లేషకులు చెబుతున్న మాట.

ఆసిస్‌పై భారత్ ఘనవిజయం

రాణించిన అర్ష్‌దీప్, సుందర్

1-1తో టి20 సిరీస్ సమం

భారత్ పుంజుకుంది. బంతితో అర్ష్‌దీప్ సింగ్ (3/35) మూడు వికెట్ల ప్రదర్శనతో విజృంభించగా, ఛేదనలో వాషింగ్టన్ సుందర్ (49 నాటౌట్) అజేయ ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. బ్యాటర్లు సమిష్టిగా రాణించటంతో 187 పరుగుల లక్ష్యాన్ని భారత్ మరో 9 బంతులు ఉండగానే ఛేదించింది. 5 వికెట్ల తేడాతో మూడో టీ20లో గెలుపొందింది. ఐదు మ్యాచుల టీ20 సిరీస్‌ను 1-1తో సమం చేసింది.

హోబర్ట్ (ఆస్ట్రేలియా) : ఆస్ట్రేలియాతో మూడో టీ20లో భారత్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. 187 పరుగుల లక్ష్యాన్ని టీమ్ ఇండియా 18.3 ఓవర్లలోనే ఛేదించింది. ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ (49 నాటౌట్, 23 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఛేదనలో అజేయ ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. ఓపెనర్ అభిషేక్ శర్మ (25, 16 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), తిలక్ వర్మ (29, 26 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), జితేశ్ శర్మ (22 నాటౌట్, 13 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. ఆసీస్ పేసర్ నాథన్ ఎలిస్ (3/36) ఆకట్టుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 186 పరుగులు చేసింది. టిమ్ డెవిడ్ (74, 38 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లు), మార్కస్ స్టోయినిస్ (64, 39 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో మెరిశారు. 3 వికెట్లతో ఆసీస్ నడ్డివిరిచిన పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. భారత్, ఆస్ట్రేలియా నాల్గో టీ20 గురువారం గోల్డ్‌కోస్ట్‌లో జరుగనుంది.



వాహ్.. వాషింగ్టన్ : ఛేదనలో అభిషేక్ శర్మ (25) సహజశైలిలో రెచ్చిపోయాడు. రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో పవర్‌ప్లేలో దండెత్తాడు. కానీ నాథన్ ఎలిస్ పేస్‌లో మార్పులతో ఓపెనర్లను తికమక పెట్టాడు. అభిషేక్ సహా శుభ్‌మన్ గిల్ (15) ఎలిస్ వలలో చిక్కారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (24) ధనాధన్ షో చూపించాడు. రెండు సిక్సర్లు, ఓ ఫోర్‌తో 11 బంతుల్లోనే 24 పరుగులు పిండుకున్నాడు. కానీ సూర్య నిలకడ చూపించలేదు. తిలక్ వర్మ (29) మిడిల్ ఆర్డర్‌లో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వికెట్ల పతనాన్ని అడ్డుకున్న తిలక్ వర్మ.. స్ట్రయిక్ రొటేషన్‌తో ఆసీస్ పేసర్ల సహనాన్ని పరీక్షించాడు.

బ్యాటింగ్ లైనప్ డగౌట్‌కు చేరగా.. వాషింగ్టన్ సుందర్ (49 నాటౌట్), జితేశ్ శర్మ (22 నాటౌట్) ఆరో వికెట్‌కు అజేయంగా 25 బంతుల్లో 43 పరుగులు జత చేశారు. వాషింగ్టన్ 3 ఫోర్లు, 4 సిక్సర్లతో చెలరేగగా.. జితేశ్ 3 బౌండరీలతో రాణించాడు. దీంతో ఐదు వికెట్లు పడినా ఒత్తిడిని జయిస్తూ మరో 9 బంతులు ఉండగానే భారత్ లాంఛనం ముగించింది.

డెవిడ్ ధనాధన్ : టిమ్ డెవిడ్ (74), మార్కస్ స్టోయినిస్ (64) అర్ధ సెంచరీలతో ఆసీస్ తొలుత భారీ స్కోరు చేసింది. అర్ష్‌దీప్ సింగ్ దెబ్బకు 14/2తో ఆసీస్ కష్టాల్లో కూరుకుంది. ట్రావిశ్ హెడ్ (6), జోశ్ ఇంగ్లిశ్ (1)ను వరుస ఓవర్లలో సాగనంపిన అర్ష్‌దీప్ ఆసీస్ దూకుడుకు కళ్లెం వేశాడు. పవర్‌ప్లే అనంతరం వరుస బంతుల్లో మిచెల్ మార్ష్ (11), మిచెల్ ఓవెన్ (0) వికెట్లతో కంగారూలను వరుణ్ చక్రవర్తి మాయ చేశాడు. కానీ టిమ్ డెవిడ్ ఓ ఎండ్‌లో దంచికొట్టాడు. ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. మార్కస్ స్టోయినిస్ సైతం డెవిడ్‌కు జత కలిశాడు. డెవిడ్ అవుటైనా.. మాథ్యూ షార్ట్ (26 నాటౌట్)తో కలిసి స్టోయినిస్ జోరందుకున్నాడు. ఈ ఇద్దరు 39 బంతుల్లోనే 64 పరుగులు జోడించగా ఆసీస్ 186 పరుగులు చేసింది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (0/26) వికెట్లు తీయలేదు.

సంక్షిప్త స్కోరు వివరాలు :

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ : 186/6 (టిమ్ డెవిడ్ 74, మార్కస్ స్టోయినిస్ 64, అర్ష్‌దీప్ సింగ్ 3/35, వరుణ్ చక్రవర్తి 2/33)

భారత్ ఇన్నింగ్స్ : 188/5 (వాషింగ్టన్ సుందర్ 49, తిలక్ వర్మ 29, అభిషేక్ శర్మ 25, నాథన్ ఎలిస్ 3/36)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68